# కార్నివాల్ థీర్ కిల్లర్స్

## మధుబాబు



MVS PUBLICATIONS

# కార్నివాల్ ఫర్ కిల్లర్స్

తన ఎనిమిది అంగుళాల పొడవున్న శరీరాన్ని నేర్పుగా నీటి దుబ్బు చాటున చేర్చి కాచుకొని వుందా నీటిపాము, ఎంతో ఓర్పుగా, కదలకుండా గంటనుంచీ అలాగే వుంది.

గంటసేపటినుంచీ దానినే చూస్తున్నాడు షాడో. దాని ఓపికకు నవ్వుకున్నాడు, అది అంతే, ఆఫ్రికా అడవుల్లో బ్రతకాలంటే ఓర్పు అవసరం. ఏ మాత్రం తొందర పడినా, ఏమీ దొరక్కపోగా , ప్రాణాలు పోగొట్టుకొనే అవకాశం వున్నది.

ఉన్నట్లుండి షాడో దృష్టి ఎగురుకుంటూ ఆ నీటిగుంట దగ్గరికి వస్తున్న కప్పమీద పడింది.

కప్పను నీటిలోకి దిగనిచ్చిందా పాము, వింటి నుంచి వెలువడిన బాణంలా వేగంగా ముందుకు దూకింది. పదునైన దాని దవడలు - కప్ప మెడ క్రింద పట్టుపట్టాయి. తన సన్నటి శరీరాన్ని దాని వంటిచట్టూ మెలిపెట్టింది.

పాము కంటే మూడింతలు పెద్దదైనా - ఆ కప్ప దాని పట్టునుంచి బయటపడలేక పోయింది. క్షణాలమీద పాముకు ఆహారంగా మారిపోయింది.

'తను చేయబోతున్న పనికి మంచి ఉపశ్రుతి ఆ సంఘటన..... ' అనుకుంటూ లేచి ఇవతలకు వచ్చాడు షాడో.

అప్రయత్నంగా అతని ఆలోచనలు రెండు రోజులు వెనక్కు మళ్ళాయి. రెండు రోజుల క్రితం కులకర్ణిగారు చెప్పిన విషయాలు అతని చెవుల్లో మార్మోగాయి.

* * *

''రాజూ! ప్రపంచ రాజ్యాల అణ్వాయుధ పోటీని తగ్గించాలని భద్రతా సమితి తీర్మానించింది. ఎవరు ఎటువంటి అణ్వాయుధ పరీక్షలు జరిపినా వెంటనే తెలుసుకొని తగిన విధంగా దండించాలని నిర్ణయించుకున్నది. అందుకు ఆ అణ్వస్త్ర పరీక్షలను డిటెక్ట్ చేసే ఒక ఎలక్ట్రానిక్ బ్రెయిన్ తయారు చేయించటానికి పథకం వేయబడింది.''

పనామా సిగరెట్ కాలుస్తూ కులకర్ణి గారి మాటలను శ్రద్ధగా వినసాగాడు షాడో, నెంబర్ వన్ ఏజెంట్ ఆఫ్ ఇండియన్ సి.ఐ.బి.

''అణ్వాయుధాలను తయారు చేసుకోకపోయినా, మనం అణురంగంలో మంచి ప్రగతిని సాధించాం. మన శాస్త్రజ్ఞుల మేధాశక్తి అపూర్వమని ప్రపంచమంతా అంగీకరించింది. అందువల్ల ఆ సాధనాన్ని

తయారు చేసి అంతరిక్షంలో భూమి చుట్టూ పరిభ్రమించేటట్టు చేయవలసిన బాధ్యతను మన దేశానికి వప్పగించింది భద్రతా సమితి.

“ఆరు మాసాలు శ్రమించి మన శాస్త్రజ్ఞులు ఎలక్ట్రానిక్ బ్రెయిన్‌ని నిర్మించారు. దాన్ని అంతరిక్షంలోకి పంపిన మరుక్షణం నుంచీ భూమిమీద అణ్వస్త్ర పరీక్షలు జరిగిన వెంటనే కనిపెట్టి హెచ్చరికలు పంపుతుంది.

“నిర్మాణం పూర్తి అయింది. ప్రపంచంలో వున్న వివిధ ప్రదేశాల ఉష్ణోగ్రతలలో అది ఎలా రియాక్ట్ అవుతుందీ అన్న విషయం తెలుసుకోవటం మాత్రం మిగిలిపోయింది. ప్రపంచమంతా తిరిగి పరిశోధనలు పూర్తి చేసుకొని తిరిగి వస్తుండగా - ఆఫ్రికా ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్ బ్రెయిన్ వున్న విమానానికి ప్రమాదం వాటిల్లింది.

“రాజు! ఈ ఎలక్ట్రానిక్ బ్రెయిన్‌ని ప్రయోగించటం కొన్ని రాజ్యాలకు ఇష్టం లేదు. అటువంటి వారికి ఇది అపూర్వావకాశం. ఆఫ్రికా తీర ప్రాంతాల్లో వున్న జాంబెసీ అరణ్యాల్లో మన విమానం కూలిపోయింది. కూలిపోయే ముందు దాని పైలట్ ఎలక్ట్రానిక్ బ్రెయిన్‌ని ఒక పారాచూట్‌కి బిగించి అరణ్యంలోకి వదిలేశాడు. ఆ ప్రదేశాన్ని రేడియో ద్వారా మనకు తెలియచేసి ప్రాణాలు వదిలాడు.

“రేడియో ద్వారా పంపబడిన ఆ వార్త మనకే కాదు - ప్రపంచ రాజ్యాలన్నిటికి వినిపించింది. ఈ ప్రయత్నానికి అయిష్టత చూపుతున్నవారు ఊరికే వుండరు. ఆ బ్రెయిన్‌ని స్వాధీన పరుచుకొని - దాని రహస్యం తెలుసుకుంటారు. మనం మరొక ఎలక్ట్రానిక్ బ్రెయిన్‌ని తయరు చేస్తే - వెంటనే దాన్ని నిరుపయోగం చేయగల యాంటీ సాధనాన్ని నిర్మిస్తారు. అలా జరిగిన మరుక్షణం భద్రతా సమితి ప్రపంచ శాంతి భద్రతలను పరిరక్షించటానికి చేపట్టిన పథకాలన్నీ తారుమారు అవుతాయి.

“అందువల్ల ఆ సాధనం మరొకరి చేతికి చిక్కక ముందే మనం వెళ్ళి దాన్ని చేజిక్కించుకోవాలి.”

మాటలు ఆపి సిగార్ వెలిగించుకుంటూ షాడో వంక చూశారు కులకర్ణి. పనామా పొగను రింగులు రింగులుగా వదులుతూ దీర్ఘ ఆలోచనలో పడ్డాడు షాడో. జాంబెసీ అరణ్యంలో కాలు పెట్టడం చాలా ప్రమాదకరం. అడవి జంతువుల బెడద ఒక్కటే కాదు. హెడ్ హంటర్స్ అనబడే అతి భయంకరమైన అడవి జాతి ఆ ప్రాంతాల్లో తిరుగుతూ వుంటుంది. నాగరికులు కనిపించిన మరుక్షణం తలలు నరికి మెడలో హారాలుగా అలంకరించుకుంటారు వారు.

అరణ్యాన్ని, ఆటవిక జాతిని ఏమార్చగలిగినా.... పోటీగా వచ్చే శత్రువులను ఎదుర్కోవటం అసాధ్యం.

కులకర్ణిగారు అన్న 'కొన్ని రాజ్యాలు' అనే మాటకు అర్థం తెలుసుకోవటం ఏమంత కష్టమైన పనికాదు. చైనా, పాకిస్థాన్, ఝరియా, ఇరాన్ మొదలైన దేశాలు... ఎలక్ట్రానిక్ బ్రెయిన్ తయారీకి విముఖత చూపించాయి.

వారి ఏజెంట్లు రంగంలోకి తప్పకుండా దిగుతారు. దానిని శాంతి కాముక రాజ్యాలకు అందనీయకుండా చేయటానికి శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తారు.

కార్నివాల్‌లో కలిసినట్లు జాంబెసీ అరణ్యంలో శత్రువులందరూ పోగవుతారు. ఒకరినొకరు చంపుకోవటానికే ప్రయత్నిస్తారు.

"రాజు! జాంబెసీ అరణ్యం చివర షెర్రా అనబడే చిన్న గ్రామం వుంది. అందులో ఒక కాన్వెంట్ - చర్చి వున్నాయి. అక్కడి ఫాదర్ నీకోసం ఒక గైడ్‌ని ఏర్పాటు చేశాడు. ఆమెకు అరణ్యమంతా బాగా తెలుసు. ఆమె సాయంతో - - - "

కులకర్ణి గారి మాటలు పూర్తికాక ముందే, "నో థాంక్స్ సర్! అక్కడికి వెళ్ళి నా తిప్పలేవో నేను పడతాను. నాకు ఒకరి సాయం అవసరంలేదు" అన్నాడు షాడో.

"నీకు శ్రమ తగ్గుతుందని ఆమెను అరేంజి చేశాం. సంతోషించక ముఖం మాడ్చుకుంటావేం?"

"నాకు శ్రమ తగ్గిస్తున్నమని మీరు అనుకుంటున్నారు. ఆ అడవి పిల్ల వెనకాలపడి పరిగెత్తేసరికి నా ప్రాణాలు పోతాయి. దారి తప్పినప్పుడల్లా - - - వన దేవతల్ని దారి చూపమని ప్రార్థిస్తూ కూర్చుంటే నా గతేం కాను ? నా రివాల్వర్ పేలినప్పుడల్లా బెదిరి పొదలలోకి పారిపోతే నేనేం చెయ్యాలి? నో సర్! నథింగ్ డూయింగ్."

కోపంగా చూసి లేచి నిలబడ్డారు కులకర్ణి. టేబిల్ మీద వున్న ఒక బటన్ నొక్కగానే ఆయన సెక్రటరీ సులోచన పెద్ద అట్ట పెట్ట పట్టుకొని లోపలికి వచ్చింది.

"రాజు... నీకు అవసరం అయ్యే సామానంతా అందులో వుంది. షెరా వెళ్ళి ఫాదర్‌ని కలుసుకో. అరేంజి చేసిన ప్లాను ప్రకారం పని పూర్తిచేయి. విష్ యూ బెస్టాఫ్ లక్." షాడో వైపు చూడకుండా చెప్పారు కులకర్ణి.

ఇక ఆయనతో వాదించి ప్రయోజనం లేదని గ్రహించాడు షాడో. విసురుగా అట్టపెట్టను అందుకొని, విసురుగానే ఒక శాల్యూట్ కొట్టి బయటపడ్డాడు.

## 2

ఢిల్లీ నుంచి ఒక మిలటరీ ఎయిర్ క్రాఫ్ట్‌లో షెర్రా చేరుకున్నాడు షాడో. షెర్రాకు రెండు మైళ్ళ అవతలగా పారాచూట్ సాయంతో కిందికి దూకి కాలినడకన గ్రామంలోకి బయలుదేరాడు. దారిలో ఒక నీటిగుంట కనిపించింది. పాము కప్పల పోరాటం - అతన్ని వెన్ను తట్టి జరగబోయే సంఘటనలను గురించి హెచ్చరించింది.

గ్రామం చుట్టూ ఎత్తుగా వత్తుగా పెరిగివున్న అరణ్య వృక్షాలమీద యింకా మంచు దట్టంగానే అల్లుకోని వుంది. నడిమింటికి వచ్చినా ఆ మంచును చెదరకొట్టలేకపోతున్నాడు సూర్యుడు.

వాతావరణం మాత్రం వేడిగా వుంది. ఉక్కపోత దారుణంగా వుంది. షెర్రా మెయిన్ స్ట్రీట్‌లో నడుస్తూ ఆ వాతావరణానికి అలవాటు పడ ప్రయత్నిస్తున్నాడు షాడో.

మెయిన్ బజార్‌లో ఒక చిన్న హోటల్ కనిపించింది. బోర్డు చూసి హోటల్ అని అనుకోవాలే కాని, హోటల్ లక్షణాలు దానికి లేవు. రేకుల

షెడ్డు, ప్లయివుడ్ గోడలు, పేడతో అలికిన నేల.... పరమ దరిద్రంగా ఉందా కట్టడం.

అయినా తప్పదు. షెర్రాలో వున్న ఏకైక హోటల్ అదొక్కటే, కౌంటర్ ముందుకు వెళుతూ - లోపల కూర్చుని వున్న టూరిస్టులను గమనించాడు షాడో.

"హల్లో... కమాన్ ... కమాన్.... రూమ్ కావాలా సార్?" అంటూ అతన్ని సాదరంగా ఆహ్వానించాడు హోటల్ యజమాని.

"చాలా రష్‌గా వున్నట్లుంది..." కను చివరల నుంచి టూరిస్టులను గమనిస్తూ అన్నాడు షాడో.

"అబ్బే - ఎక్కడ సార్! ఝరియా నుంచి ఆరుగురు జియాలజిస్టులు వచ్చారు. చైనా నుంచి పదిమంది మైనారాలజిస్టులు ఏతెంచారు. ఇంకో పాతికమంది వస్తే గాని మన హోటల్ నిండుకోదు...." షాడో సామాన్లను లోపలికి తీసుకుపోతూ అన్నాడు హోటల్ యాజమాని.

స్నాన పానాదులు ముగించుకొని కాన్వెంట్ వైపు బయలుదేరాడు షాడో. అతని అంతరంగంలో అనేక రకాల ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి.

అనుకున్నట్లే అందరూ హాజరైనారు. రావాల్సింది పాకిస్థాన్ ఒక్కటే. వారు కూడా వస్తే కార్నివాల్ ప్రారంభింపబడుతుంది.

ఉన్నట్లుండి షాడో మెడమీది వెంట్రుకలు నిక్కబొడుచు కున్నాయి. తనని ఎవరో పరీక్షగా గమనిస్తున్నట్లు గ్రహించి యాధాలపంగా భుజం మీది నుంచి చూశాడు.

ఒక చెక్కల గుడిశెల ముందు నిలబడి షాడోనే చూస్తున్నాడు ఆరు అడుగుల ఆజానుబాహుడు.

షాడో సూటిగా ముందుకే వెళ్ళాడు. ఒక పళ్ళదుకాణం ముందు ఆగి రెండు యాపిల్ పళ్ళను బేరం చేస్తూ ఆ వ్యక్తిని పరికించాడు.

మరొక నూతన వ్యక్తి ఆ ఆజానుబాహుణ్ణి కలిశాడు. ఇద్దరూ అతని వంకే చూస్తూ ఏదో విషయం చర్చించుకుంటున్నారు.

వారి రూపాలు షాడో హృదయంలో ఫోటోల మాదిరి ముద్రించుకు పోయాయి. ఖరీదు చేసిన యాపిల్‌ని ఆరగిస్తూ ముందుకు వెళ్ళాడు. ఒక మలుపులో కనిపించింది కాన్వెంట్.

* * *

ఆవరణలో కేరింతలు కొడుతున్న అడవిజాతి పసికందులను గమనిస్తూ కాన్వెంటు ఆఫీసులోకి అడుగుపెట్టాడు షాడో.

నల్లటి టేకు బల్లముందు ఒక అందమైన యువతి కూర్చుని వుంది. తెల్లటి మినీ స్కర్టులోనుంచి బలమైన ఆమె తొడలు బయటికి కనిపిస్తున్నాయి.

"వాట్ కెనైడూ ఫర్ యూ?" షాడోని చూడగానే మృదువుగా ప్రశ్నించిందామె.

ఆ కంఠ మాధుర్యం షాడో మనస్సును యిట్టే ఆకట్టుకుంది. 'హెల్ విత్ ది ఎస్సైన్‌మెంట్. హాయిగా ... యీ కాన్వెంట్ లోనే ఓ నెలరోజులు వుండి వెళితే ఎలా వుంటుంది?' అనుకుంటూ

"మై నేమ్ ఈజ్ షాడో మేడమ్. షాడో వచ్చాడని ఫాదర్‌కి తెలియచెయ్యండి." అన్నాడు. అతని పేరు వినగానే ఆమె కనుబొమ్మలు ముడిపడ్డాయి. క్రిందికీ పైకీ ఎగాదిగా చూసింది. ఎందుకో అర్థం చేసుకోలేకపోయాడు షాడో.

"కారిడార్‌లో రెండవ గది. ఫాదర్ మీ కోసమే ఎదురుచూస్తున్నారు." ముక్తసరిగా వినవచ్చింది ఆమె సమాధానం.

తనమీద ఆమెకు అంతకోపం దేనికో అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ ఫాదర్ గదిని సమీపించాడు షాడో.

"హల్లో, గ్లాడ్ టు సీయూ మిస్టర్ షాడో! నీ స్నేహితులందరూ నిన్ననే వచ్చారు. ఏ క్షణంలో నైనా బయలుదేరాటానికి సిద్ధంగా ఉన్నారు." షాడోని ఆహ్వానిస్తూ అన్నాడు ఫాదర్.

"చూశాను సార్.... యింకో రంగు రావాలి. ఝురియా వాళ్ళు బోలెడంత లగేజితో వచ్చారు. వంటరిగా లైట్‌గా ప్రయాణిస్తే నేను వీరినందర్నీ ఏమార్చి ముందుకు పోగలను." ఆయన చూపించిన కుర్చీలో కూర్చుంటూ కామెంట్ చేశాడు షాడో.

"యువార్ కరెక్ట్ మై బాయ్... మీరిద్దరూ లైట్ గానే ప్రయాణం చెయ్యాలి."

"ఇద్దరమా?"

"యస్ మిస్టర్ షాడో! నువ్వు, నీ గైడ్."

ఎక్కడలేని నీరసమంతా వచ్చి షాడోని ఆక్రమించుకుంది -

"ఫాదర్... ఆ అమ్మాయికి మన భాషలేమైనా వచ్చా? కనీసం నాలుగు పిడ్గిన్ యింగ్లీషు ముక్కలైనా వచ్చి వుండకపోతే నా పని చాలా దారుణంగా తయారౌతుంది."

షాడో ముఖం చూసి గలగలా నవ్వాడు ఫాదర్. "వాటీజ్ దిస్ మై బాయ్.... ఆమెను కలుసుకునే లోనికి వచ్చావు. ఆ మాత్రం గమనించలేకపోయావా?"

కుర్చీలో నుంచి క్రింద పడతానేమో అని భయపడి కుర్చీ హేండిల్స్‌ని గట్టిగా పట్టుకొని కూర్చున్నాడు షాడో.

అతని ముఖం చూసి మరింతగా నవ్వుతూ "కెటీనా!" అని పిలిచారు ఫాదర్. గాలిలో కదులుతున్న గులాబీలా వచ్చింది కెటీనా.

"నీకు ఆశాభంగం కలిగించినందుకు చాలా విచారిస్తున్నాను, మిస్టర్ షాడో!" అన్నది చక్కటి ఇంగ్లీషు భాషలో.

"మీరు అనేది నాకు అర్థం కావటం లేదు" అయోమయంగా అన్నాడు షాడో.

"అడవి పిల్లనని అనగానే లావుగా కిందికి జారిన పెదిమలు, నల్లటి వంటిమీద రంగులు పూసల దండలు బొమికల హారాలు... పిడ్గిన్ యింగ్లీషు - - -"

"చాలు - చాలు. అర్థం అయింది" తల ఎక్కడ దాచుకోవాలో తెలియక ఆమె మాటలకు అడ్డు వచ్చాడు - షాడో. తను అనుకున్నట్లుకాక

ఆమె అపురూప సుందరి అవటామే ఒక షాక్ అనుకుంటుంటే.... తన భావాలను కనిపెట్టి ముఖంమీదే చెప్పేయటం మరో పెద్ద షాక్ అయింది.

"నా రూపం మార్చుకోలేక పోయినా... భాషను మార్చుకోగలను... యూ బిగ్ బిగ్ మాన్... కమ్ కమ్ కమ్ లాంగ్ జర్నీ" గుండ్రటి కళ్ళను పెద్దవి చేసి అమాయకంగా ముఖం పెట్టి అడిగింది కెటీనా.

"యస్ మేడమ్! మీ బిగ్ బిగ్ స్టుపిడ్ మాన్" నవ్వాడు షాడో. కెటీనా అతనితో జత కలిపింది.

"నాకు చెప్పిన వివరాలను బట్టి మీ రూపం వూహించుకున్నాను. ఇలా వుంటారని తెలిస్తే ఇండియా నుంచే గైడ్ కావాలి - గైడ్ కావాలి అని గంతులు వేస్తూ వచ్చేవాణ్ణి. " పనామా వెలిగించుకుంటూ అన్నాడు షాడో.

"ఇటీజ్ ఆల్ రైట్ మిస్టర్ షాడో! మేము మరోలా భావిస్తే గదా, నువ్వు బాధ పడవలసింది! కెటీనా స్విట్జర్లాండ్ యూనివర్శిటీలో ఎమ్.ఎ. చదువుతున్నది. వేసవి సెలవులు గడపటానికి యిక్కడికి వచ్చింది."

"రెండు నాగరికతల ప్రతిబింబం అన్నమాట! కెటీనా, పేరు చాలా బాగుంది."

"థాంక్యు మిస్టర్ షాడో."

“మిస్టర్ షాడో! ఈ రాత్రికి నువ్వు యిక్కడే ఉండాలి. డిన్నర్ అరేంజు చేయిస్తున్నాను. కెటీనా.... నువ్వూ ఒకరినొకరు బాగా అర్థం చేసుకోవాలి. లేకపోతే అరణ్యంలో కలిసి పని చేయటం చాలా కష్టం.”

అభ్యంతరం చెప్పటానికి ప్రయత్నించాడు షాడో. వీలుపడలేదు. ఫాదర్ సజషన్‌కి అంగీకరించి బయటపడ్డాడు.

మెయిన్ బజారులోకి వచ్చి అంతకు ముందు తనను పరిశీలనగా చూసిన వ్యక్తులను మరొక్కసారి గమనించాడు. ఆ చెక్క కట్టడం ముందే నిలబడి వున్నారు వారిద్దరూ.

వారికి సమీపంలో అడుగులు వేస్తూ కట్టడం గోడకు బిగించి వున్న సైన్ బోర్డును గమనించాడు.

“గిబ్బన్ - - - గైడ్ అండ్ స్కిన్ ట్రేడర్ “

అడవిలో దార్లు చూపించగల గైడ్, జంతువుల చర్మాలను అమ్ముకునే వ్యాపారి.

గిబ్బన్‌ని గురించిన ఆలోచనలతో మెల్లిగా హోటల్‌ని సమీపించాడు షాడో. హోటల్ ముందున్న వరండాలో కూర్చుని చదరంగం ఆడుతున్నాడు ఝరియా దేశస్థుడు. వంటరిగా తనతో తనే పోటి పడుతున్నాడు.

సిగిరెట్ వెలిగించుకుంటూ వెళ్ళి అతని ముందున్న బెంచీ మీద కూర్చున్నాడు షాడో.

ఒకరికొకరు ఎదురు పడకుండా రహస్యంగా పనిచేసే అసైన్‌మెంట్ కాదది. ఎదురుపడి ప్రత్యర్థుల సత్తా ఎంతటిదో తెలుసుకోవటం వల్ల కొద్దిగా ప్రయోజనం ఉంటుంది.

"గుడ్ మార్నింగ్ మిస్టర్... మై నేమ్ ఈజ్ షాడో."అన్నాడు చదరంగం బల్లమీది పావుల్ని సరిచేస్తూ.

కళ్ళు చిట్టించి - - - చిన్నగా నవ్వాడా వ్యక్తి. "అయామ్ కుర్షీద్ - - - కర్నల్ కుర్షీద్" అన్నాడు చేయి అందిస్తూ .

కరచాలనం చేసి ఆట ప్రారంభించాడు షాడో.

అరగంట తరువాత మంత్రిని పోగొట్టుకున్నాడు. ఒక ఏనుగు గోవింద కొట్టింది. ఎన్ని పోయినా..... తన జోడు గుర్రాలను మాత్రం జాగ్రత్తగా కదిలిస్తున్నాడు. వాటిని చంపటానికి ఎంతోగానో ప్రయత్నించాడు కుర్షీద్. చంపలేక పోయాడు.

"జాంబెసీ అరణ్యంలో జియాలజీ ఎక్స్‌పెరిమెంట్లు చేద్దామని వచ్చారా?" యాధాలాపంగా అడిగాడు షాడో.

"అవును."

“మీ ప్రయోగాలు ఫలించవని పందెం.”

“ చూద్దాం” అంటూ షాడో రాజుకు తన మంత్రితో చెక్ పెట్టాడు కర్నల్ కుర్షీద్.

షాడో ఓడిపోయాడు. పావులను బల్లమీదికి దొర్లించి లేచి నిలబడ్డాడు.

“ఓ.కే - కర్నల్.... మళ్ళీ కలుద్దాం....” అంటూ హోటల్ లోపలికి వెళ్ళి తన సామానుతో బయటికి వచ్చాడు.

అదే సమయంలో ఇద్దరు చైనీయులు గడపలో అడుగుపెట్టారు. వారితో ఢీ కొన్నాడు షాడో. ముగ్గురూ వీధిలోకి దొర్లిపడ్డారు. మెల్లిగా లేచి నిలబడ్డాడు షాడో. చైనీయులు ఏమీ మాట్లాడలేదు. దుమ్ము దులుపుకుంటూ తలలు వంచుకొని లోపలికి వెళ్ళిపోయారు.

నవ్వుకుంటూ వెనుదిరిగాడు షాడో.

కాన్వెంట్‌లో అతని కోసం చిన్న గది ఏర్పాటు చేయబడింది. దుస్తులు మార్చుకొని విశ్రాంతి తీసుకుని రెడీ అయ్యేసరికి, డిన్నర్ టైం అయింది. డిన్నర్ టేబిల్ ముందు ఫాదర్, కెటీనా మాత్రమే కూర్చుని వున్నారు. మిగిలిన కాన్వెంట్ స్టాఫ్ అంతా ఆ రోజు మరొక చోట డిన్నర్ తీసుకుంటున్నారు.

నవ్వుతూ, కబుర్లు చెప్పుకుంటూ డిన్నర్ ముగించారు. మాట వరసలో గిబ్బన్‌ని గురించి అడిగాడు షాడో.

"మిస్టర్ షాడో.... గిబ్బన్ విషయంలో నువ్వు చాలా జాగ్రత్తగా వుండాలి. డబ్బు కోసం ఎటువంటి ఘాతుకమైనా చేస్తాడు " హెచ్చరించాడు ఫాదర్.

"మా చర్చిలో వున్న ట్రాన్స్‌మీటర్ లాంటిదే అతని దగ్గిరా వుంది. ఎలక్ట్రానిక్ బ్రెయిన్ సంగతి అతనికి కూడా తెలిసే వుంటుంది."

ఫాదర్ మాటలు షాడో అంతరంగంలో అణుగుతున్న ఆలోచనా తరంగాల్ని తిరిగి రెచ్చగొట్టాయి.

చైనా, ఝురియా, గిబ్బన్ - ప్రయాణానికి సిద్ధంగా వున్నారు. పాకిస్థాన్, ఇరాన్ దేశాలు రానట్టే లెక్క. అందరూ ప్రమాదకరమైన వారే. అందరిలోకి గిబ్బన్ ఎలక్ట్రానిక్ బ్రెయిన్‌ని స్వాధీన పరుచుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆ ప్రాంతాల్లో నివసిస్తున్నాడు. కాబట్టి అడవి దారులు అతనికే బాగా తెలుస్తాయి. ఎలక్ట్రానిక్ బ్రెయిన్‌ని చేజిక్కించుకొని, ఎక్కువ ధర ఇచ్చిన వారికి అమ్మే ప్రయత్నం చేస్తాడు.

ఈ పరుగు పందెంలో తను గెలిచి తీరాలి. లేకపోతే శాంతికాముక దేశాలు - యుద్ధోన్మాదుల పైశాచిక అట్టహాసాలకు తట్టుకోవడం కష్టం.

ఈ విషయాలన్నీ కెటీనాకు తెలుసా? ఈ చావు బ్రతుకుల వ్యవహారంలో ఆమె తట్టుకొని నిలబడగలదా?

షాడో ఆలోచనలు పూర్తి కాకముందే డిన్నర్ అయిపోయింది.

షాడో, కెటీనా మరునాడు ప్రయాణం ప్రారంభించటానికి నిర్ణయింపబడింది.

వారిద్దరికి గుడ్ నైట్ చెప్పి తన గదికి తిరిగి వచ్చాడు షాడో. దిండు కింద దాచిన రివాల్వర్ తీసి ఆయిల్ క్లాత్‌తో శుభ్రంగా తుడిచాడు. బుల్లెట్లను పరిశీలించి, డాగర్‌ని అందుకున్నాడు.

దాని పదునును పరిశీలిస్తుండగా... కిటికీ అవతలవున్న గదిలో లైటు వెలగటం కనిపించింది.

గాజు కిటికీ మీద చిన్న నీడ ప్రత్యక్షమయింది. ఉన్నట్లుండి షాడో నరాలు జివ్వుమన్నాయి.

అవతలి గది కెటీనాది. నిద్ర పోవటానికి డ్రస్ ఛేంజి చేసుకుంటున్నట్లు నీడను బట్టి తెలుస్తున్నది.

మరో రెండు నిమిషాల తరువాత లైటు ఆరిపోయింది. కెటీనా నీడ మాయమైపోయింది.

గాలి ఆడక షాడో శరీరమంతా చమటలతో తడిసి పోయింది. ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టలేదు. షర్టు వూడదీసి గది మూలకు విసిరి కొట్టాడు. బేర్ బాడీతో... అలాగే మంచం మీద పొరలాడటం ప్రారంభించాడు.

ఉన్నట్లుండి అతని గది ఆవలి ప్రక్క ఏదో శబ్దం అయింది. ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. గది గోడలను ఆనుకొనివున్న క్రోటన్స్ చాటుగా అడుగులు వేస్తూ ఒక ఆకారం కెటీనా వున్న గదివైపు వెళుతూవుండటం కిటికీలో నుంచి కనిపించింది.

షాడో చేయి తలగడ క్రిందవున్న డాగర్ మీద పడింది. నిశ్శబ్దంగా తలుపు తెరిచి - చీకటి మాటున కెటీనా గదివైపు అడుగులు వేశాడు.

కెటీనా గదికి వున్న గాజు కిటికీని తెరిచి లోనికి వెళ్ళింది ఆ ఆకారం . షాడో వేగంగా అడుగులు వేశాడు. అతను కిటికీని సమీపించేసరికి లోపలి నుంచి ఎగిరి బయటికి దూకిందా ఆకారం సూటిగా షాడో మీద పడింది.

పడిపోకుండా బాలెన్స్ నిలుపుకొని ఎడమ చేతితో ముఖంమీద చరిచాడు షాడో.

"మై గాడ్!" అన్న అరుపు వెలువడింది ఆ ఆకారం నోటిలో నుంచి.

మరుక్షణం అతన్ని గిబ్బన్ గుడిశె ముందు చూసిన విషయం జ్ఞప్తికి తెచ్చుకున్నాడు షాడో.

ఒక అడుగు ముందుకు వేసి బలమంతా పిడికిటిలోకి తెచ్చుకుని మరొక పిడిగుద్దు గుద్దాడు.

ఎగిరి పడి అడుగుల దూరంలో పడ్డాడతను. కంకరనేల కావడంతో ముఖం దోక్కుపోయింది.

పడిన వెంటనే లేచి వెను తిరిగి చూడకుండా పరుగు అందుకున్నాడు. రెండు క్షణాలలో ప్రహరీని సమీపించి - ఒకే ఒక గెంతులో గోడమీదినుంచి అవతలికి దూకేశాడు.

అతన్ని అనుసరించాలన్న కోరికను అదిమిపట్టుకొని కిటికి గుండా కెటీనా గదిలోకి అడుగుపెట్టాడు షాడో. ఆ వ్యక్తి కెటీనా గదిలోకి ఎందుకు వచ్చాడో అతనికి అర్థం కాలేదు.

కిటికీ ప్రక్కగా టేబిల్ మీద వున్న కాండిల్ని వెలిగించాడు. ఆ మసక వెలుగులో కనిపించిన దృశ్యం - అతని శరీరాన్ని జలదరింప చేసింది.

మంచం మీద బోర్లా పడుకుని వున్నది కెటీనా. నడుము వరకూ నగ్నంగా వుంది. పిరుదుల మీది నుంచి కాళ్ళ వరకూ పల్చటి దుప్పటి నొకదాన్ని కప్పుకుని వుంది. ఆచ్ఛాదన లేని ఆమె వీపు మీద నాలుగు అంగుళాల పొడవు, రెండు అంగుళాల వెడల్పు ఉన్న అడవి మండ్రగబ్బ ఒకటి నిలబడి వుంది. షాడో ముఖం నిండా స్వేద బిందువులు

అలుముకున్నాయి. అతి ప్రమాదకరమైన కీటకం అది. అది కుడితే, వెంటనే వైద్య సహాయం లభించని ఎడల ప్రాణాపాయం తప్పదు. నాడీ కేంద్రమైన వెన్నెముక మీద కుడితే వైద్యసహాయం అనవసరం. క్షణాలమీద ప్రాణాలు పోతాయి.

గిబ్బన్ అనుచరుడు కావాలనే దాన్ని కెటీనా మీద వదిలాడు. అందుకే అక్కడికి వచ్చాడు. ఏ క్షణంలోనైనా కెటీనా కదలవచ్చు. ఆమె కదిలిన మరుక్షణం కొండెతో కొడుతుంది మండ్రగబ్బ.

షాడో మనస్సు అతి వేగంగా ఆలోచించసాగింది. తాను దగ్గరికి వెళ్ళటం కూడని పని. ఏ మాత్రం అలికిడి అయినా మండ్రగబ్బ కదులుతుంది. అది కదిలితే, ఆ స్పర్శకు కెటీనా లేస్తుంది. ఆమె లేచిన మరుక్షణం యిది దెబ్బతీస్తుంది.

నిస్సహాయంగా గదంతా కలియచూశాడు షాడో. గడుస్తున్న ప్రతి సెకండూ... కెటీనాను మృత్యుముఖంలోకి తీసుకుపోతున్నది.

పెదవులు బిగపట్టి, మనసులో చెలరేగుతున్న ఆలోచనలను అదిమిపెట్టి – డాగర్‌ని ఎత్తాడు షాడో. గురితప్పితే.... జరగబోయే అనర్థకం గురించి ఆలోచించదలచలేదు.

నిలబడిన చోటులోనే మోకరించి కూర్చుని డాగర్‌ని కెటీనా వీపునకు గురిచూసి ఊపిరి బిగబడ్డాడు.

ముందుకాళ్ళును క్రిందికి దించి, వెనుక కాళ్ళను ఎత్తింది మండ్రగబ్బ. ఆ కాస్త స్పర్శకే కెటీనా కొద్దిగా కదిలింది. మరుక్షణం కొండెను ముందుకు వంచింది మండ్రగబ్బ.

తుమ్మెదలాగా ఝుంకారం చేస్తూ గాలిని చీల్చుకుని ముందుకు వెళ్ళింది షాడో డాగర్. కెటీనా వీపును తాకీ తాకకుండా - మండ్రగబ్బను ఎత్తి గోడకేసి కొట్టింది.

కెవ్వుమని అరుస్తూ లేచి కూర్చుంది కెటీనా . ఆమె అరుపుల్ని లక్ష్యపెట్టకుండా మంచంమీది నుంచి జంప్ చేసి అవతలకి దూకాడు షాడో. కొండెను నిటారుగా ఎత్తిపట్టుకుని వేగంగా కదులుతున్నది - మండ్రగబ్బ. డాగర్‌ని తీసుకుని దాని నడుంమీద పొడిచి చంపేశాడు షాడో.

దుప్పటిని భుజాలచుట్టూ కప్పుకుని కెటీనా లేచి నిలబడింది. మండ్రగబ్బను చూసేసరికి ఆమె శరీరం కంపించింది. నిలబడటానికి కూడ శక్తిలేనట్లు మంచం చివర కూర్చుండిపోయింది.

కిటికీ దగ్గిర పడివున్న చిన్న అట్టపెట్టెను గమనించి అటు వెళ్ళాడు షాడో. అందులో మరొక మండ్రగబ్బ కనిపించేసరికి కాలితో తొక్కి ఖతం చేసేశాడు.

మెల్లిగా ముందుకువచ్చింది కెటీనా, షాడో భుజంమీద చెయ్యివేసి, "మిస్టర్ షాడో! ఆ తేలు కుడితే ఏమౌతుందో నాకు తెలుసు. నా ప్రాణాలు కాపాడావు. నీ ఋణం ఎలా తీర్చుకోను" అన్నది.

"కెటీనా..... బాగా ఆలోచించుకుని సమాధానం ఇవ్వు. నాతో చేయి కలిపినందుకు బహుమతులు ఇటువంటి ప్రమాదాలే. నువ్వు నాకు దారి చూపించబోతున్నావని అందరికీ తెలిసింది. నిన్ను అడ్డు తొలగిస్తే , నా ప్రయాణం ఆలస్యం అవుతుందని శత్రువులు గ్రహించారు. ఇది మొదటి ప్రయత్నం మాత్రమే. ఇటువంటివే మరికొన్ని జరుగవచ్చు. అనవసరంగా నువ్వు ప్రమాదాల్లో అడుగుపెట్టడం నాకు ఇష్టం లేదు. అరణ్యంలో దారి చూసుకోగల సామర్థ్యం నాకు వుంది. నువ్వు నీ ప్రయాణాన్ని ఆపుకోవటం చాలా మంచిది."

షాడో మాటలు వింటూ నిర్జీవంగా పడివున్న మండ్రగబ్బల వంక చూసింది కెటీనా.

"మిస్టర్ షాడో.... నా ప్రాణాలు కాపాడావు. అందుకు ప్రతిగా మీ ఎలక్ట్రానిక్ బ్రెయిన్‌ని వెతకటంలో నీకు సాయం చేసి ఆ ఋణం తీర్చుకుంటాను." ముక్తసరిగా సమాధానం ఇచ్చింది.

చిరునవ్వుతో ఆమె చెక్కిలి మీద చిటికెవేసి కిటికీలో నుంచి బయటకు దూకాడు షాడో. తన గదికి వెళ్ళి మూలకు విసిరిన షర్టును ధరించాడు. బూట్లు తొడుక్కొని రివాల్వర్ బెల్టు వెనుక చేర్చి నిశబ్దంగా ఆవరణ దాటాడు.

మెయిన్ స్ట్రీట్ నిర్మానుష్యంగా ఉంది. గిబ్బన్ గుడిశెలో నుంచి లైటు రోడ్డు మీదికి ప్రసరిస్తున్నది. పెద్ద పెద్ద అడుగులు వేస్తూ గుడిశె ప్రక్క భాగానికి వెళ్ళి సగం తెరిచివున్న కిటికీలోనుంచి లోపలకు తొంగి చూశాడు.

ఒక చిన్న స్టూల్ మీద కూర్చుని వున్నాడు గిబ్బన్ అనుచరుడు. గిబ్బన్ అతని ముఖంమీది గాయలకు మందు వేస్తున్నాడు.

ఆ దృశ్యం చూడగానే షాడో రక్తం వుడుకెత్తిపోయింది. గుడిశె ముందుకు వచ్చి బలంగా ముఖద్వారాన్ని తన్నాడు.

ధన్‌మన్న శబ్దంతో ఒక తలుపు విరిగి, లోపల పడిపోయింది అనుచరుడి ముఖంమీద గాయలకు మందువేస్తున్న గిబ్బన్ అదిరిపడి వెనుతిరిగాడు.

ముఖం దోక్కుపోయిన వ్యక్తి భయంగా చూస్తూ లేచి నిలబడ్డాడు. రెండు అంగల్లో వారిని సమీపించాడు షాడో. కుడిచేతిని పిడికిలి బిగించి శక్తి కొలది ఆ వ్యక్తి గడ్డం మీద గుద్దాడు.

పోయి గోడకు గుద్దుకొని - అలాగే ఇసుక మూటలా కిందికి జారిపోయాడా వ్యక్తి .

గిబ్బన్ వంక చూశాడు షాడో. అతను నోరు విప్పితే అక్కడికక్కడే హతం అయిపోయేవాడు.

కింద పడిన అనుచరుణ్ణీ - షాడోని మార్చి మార్చి చూశాడు గిబ్బన్. చిన్న నవ్వు అతని పెదిమల మీద ప్రత్యక్షమయింది అతి క్రూరంగా.

‘‘నాట్ నౌ మిస్టర్ షాడో..... నాట్ నౌ.... ముందుంది ముసళ్ళ పండుగ ’’ అన్నాడు తల అడ్డంగా తిప్పుతూ .

‘‘టేక్ యువర్ టైం. నీకోసం నేనెప్పుడూ సిద్ధంగానే వుంటాను’’ కరకర మంది షాడో కంఠం.

వెను తిరిగి కాన్వెంట్ లోకి వచ్చాడు. తలగడ మీద తల ఆనించగానే గాఢనిద్ర పట్టింది. తిరిగి లేచేసరికి తెల్లవారుఝాము నాలుగు గంటలు అయింది.

* * *

"మే గాడ్ బ్లెస్ యూ మై చిల్డ్రన్! ఐ విల్ ప్రే ఫర్ యూ..." మెడలోని క్రాస్‌ని కుడిచేతితో పట్టుకొని ఆశీర్వదించాడు ఫాదర్.

ఆయనకు గుడ్ బై చెప్పి కెటీనాను అనుసరించాడు షాడో. రైఫిల్స్ బరువు అధికం అని విల్లు, అంబులు వెంట తీసుకున్నాడు. ఒక పదునైన వేటకత్తిని నడుముకు వ్రేలాడదీసుకున్నాడు.

ఝురియా ఏజెంట్లు అర్ధరాత్రిలో బయలుదేరి వెళ్ళిపోయారు. మూడుగంటల వేళకి గిబ్బన్ కదిలిపోయాడని తెలిసింది. చైనా వారు ఇంకా గ్రామంలోనే ఉన్నారు.

మోకాళ్ళు దాటని ఆకుపచ్చరంగు పరికిణీ, చిన్న జాకెట్టు ధరించింది కెటీనా. ఆ కొద్దిపాటి దుస్తుల్లో నుంచి కనిపిస్తున్న ఆమె వంపు సొంపులు షాడో నరాలలోని రక్తాన్ని వేడి ఎక్కించటం ప్రారంభించాయి.

అలసట అనేది ఎరుగనట్లు వేగంగా అడుగులు వేస్తూ అరణ్యంలోకి దారి తీసిందామె. బయలుదేరిన గంటలోనే వారిని తనలో దాచుకుంది అరణ్యం.

ఎత్తయిన చెట్లు వారిచుట్టూ కమ్ముకొని, నాగరిక ప్రపంచానికి, వారికి మధ్య దట్టమైన తెరలు దించాయి.

# 3

ప్రపంచంలో ఉన్న మిగతా అరణ్యాల లాగా సందడిగా వుండవలసిన జాంబెసీ కీకారణ్యం అందుకు భిన్నంగా వుంది. గాలికి కదలిన ఆకుల గలగలలు తప్ప మరెటువంటి శబ్దమూ వినిపించటంలేదు. అప్పుడప్పుడూ దూరంలో నుంచి వినవస్తున్న కోతుల కిచకిచలు తప్ప ....మరే విధమైన జంతు శబ్దాలు గాని, జంతువులు గాని కనిపించటంలేదు.

అయినా, కొన్ని లక్షల కళ్ళు , ఆకులను, పొదలను చాటు చేసుకుని తమ మధ్యకు వచ్చిన మానవుణ్ణి గమనిస్తూనే ఉన్నాయి.

చావు, చక్కదనం రెండూ చేతులు కలుపుకుని ప్రక్క ప్రక్కన నిలబడి వున్నాయి ఆ అరణ్యంలో.

నాగరిక ప్రపంచంలో కసపడటానికి అవకాశం లేని ప్రకృతి వింత సృష్టిని గమనిస్తూ కెటీనా వెనుకే అడుగులు వేయసాగాడు షాడో.

ఎక్కడా ఆగకుండా పన్నెండు గంటలు కొట్టేదాకా ప్రయాణం సాగించారు. ఒక పెద్ద మర్రిచెట్టులాంటి చెట్టు కింద ఆగి “విశ్రాంతి “ అన్నట్లు తల వూగించింది కెటీనా.

“యువ్వార్ యిన్ సూపర్బ్ కండిషన్ మిస్టర్ షాడో! నాతో సమానంగా ఈ అడవిలో నడుస్తావని అనుకోలేదు.” అన్నది ఒక పెద్ద బండరాయి మీద కూర్చుంటూ.

గంభీరంగా నవ్వాడు షాడో. ఏదో చెప్పాలని నోరు తెరిచాడు. అదే సమయంలో అక్కడి నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఒక పెద్ద కేక వారికి వినిపించింది. ఆత్మరక్షణ చేసుకోలేక నిస్సహాయ స్థితిలో చిక్కుపడిన ఒక అభాగ్యుని చావు కేక అది.

ఒక్క గంతులో లేచి అరుపు వినవచ్చిన దిశకు పరుగుతీశాడు షాడో.

దట్టంగా పెరిగి ఉన్న ముళ్ళ పొదలను పేటకత్తితో ఛేదించి అవతలి ప్రక్కకు వెళ్ళాడు. అక్కడ కనిపించిన దృశ్యం చూసి ఏంచేయాలో తోచక రాతి బొమ్మలా నిలబడిపోయాడు.

ఐదు అడుగుల ఎత్తున్న చిన్న పిగ్మీజాతి అడవి మనిషిని తన శరీరంతో చుట్టలు చుట్టి విరుస్తున్న దొక పెద్ద కొండ చిలువ . ముదురు పచ్చరంగుమీద నల్లటి చారతో మిలమిలా మెరిసిపోతుంది దాని శరీరం. ఇరపై అయిదు అడుగుల పొడవు ఉన్న దాని శరీరం - ఆ వ్యక్తి మెడ దగ్గర్నించి పాదాల వరకూ ఇనుప స్ప్రింగులా చుట్టలు చుట్టుకుని ఉంది.

వీపుకు వ్రేలాడుతున్న విల్లంబులను అవతలికి విసిరి - వేటకత్తిని బిగించి పట్టుకుని ముందుకు అడుగులు వేశాడు షాడో. కాని కత్తిని ఉపయోగించడానికి వెనుకాడాడు. గురి తప్పి ఆ వ్యక్తికి తగిలే అవకాశం వుంది.

కత్తిని కూడా పక్కకు విసిరి రెండు చేతులతోనూ కొండచిలువ నడుం పట్టుకొని యివతలికి లాగడానికి ప్రయత్నించాడు. నూనె రాసినట్టు చెయ్యి వేస్తే జారిపోతున్నది. పట్టు చిక్కటంలేదు.

ఆ మనిషి కుడిపాదం కొండచిలువ నోటిలో ఉంది. దాని పళ్ళు అతని చర్మంలో దిగబడి రక్తం వెల్లువలా కారుతున్నది.

కొండచిలువ అటెంక్షన్‌ని డైవర్టు చేయగలిగితే ఫలితం ఉండవచ్చనే వూహతో దాని తలను సమీపించాడు షాడో. వెంటనే ఆ వ్యక్తి పాదాన్ని వదిలి భయంకరంగా బుసకొడుతూ షాడో మీదికి వచ్చింది. ఎగిరి వెనక్కు దూకాడు షాడో. వెంట్రుక వాసిలో దాని దంతాలకు అందకుండా తప్పించుకున్నాడు.

కొండచిలువ తలను వెనక్కి వంచి, సూటిగా అతని వంకే చూడసాగింది. మరొకసారి తల విసరటానికి సిద్ధపడుతున్నదని గ్రహించి

జాగ్రత్తపడ్డాడు షాడో. దాని తల విసురు చాలా ప్రమాదకరమైనటువంటింది. ఆ దెబ్బ తగిలితే ఎముకలు విరిగిపోతాయి.

అనుకుంటుండగానే వేగంగా తలను ముందుకు వంచిందది. రెడీగా వున్న షాడో వెల్లికిలాపడి, మరోసారి తప్పించుకున్నాడు.

వెంటనే తలను క్రిందికి వంచి, షాడో పాదాలను నోటకరిచి పట్టటానికి ప్రయత్నించింది కొండచిలువ ఆ గొడవలో తను బంధించి వుంచిన మనిషి సంగతి మరిచిపోయింది. అతని చుట్టూ చుట్టివున్న దాని శరీరం వదులయింది.

పాదాలకు సమీపించిన దాని తలను బూటు కాలితో బలంగా తన్ని, రెండుచేతులతోను ఒడిసి పట్టుకున్నాడు షాడో.

అతన్ని విదిలించి కొట్టాలని వేగంగా తలను పైకిలేపిందది. దానితోపాటు గాలిలోకి లేచాడు షాడో. అయినా పట్టు వదలలేదు.

క్రోధంతో దారుణంగా బుసలు కొట్టడం ప్రారంభించిందది. తలను పది అడుగుల ఎత్తుకు లేపి నేలకేసి బాదింది. మొదటిసారి తట్టుకున్నాడు షాడో. రెండవ సారి కాలు మెలిక పడి నేలకూలాడు.

అదే అదునుగా....శరీరాన్ని షాడో వంటి చుట్టూ మెలిపెట్టింది కొండచిలువ. మొదటి వ్యక్తిని వదిలేసింది.

పదిటన్నుల బరువున్న రాళ్ళ గుట్టక్రింద పడినట్లయింది షాడో పరిస్థితి. క్షణ క్షణానికి అతని అవయవాల మీద వత్తిడి హెచ్చుకాసాగింది.

కొండచిలువ తలను మాత్రం వదలకుండా గట్టిగా బిగించి పట్టుకొనే వున్నాడు. తలను వదిలించుకోవాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నదది.

దాని తల తన చేతులలో నుంచి జారిన మరుక్షణం తను మరణించినట్లే అని గ్రహించాడు షాడో. శరీరంలోని ఎముకలు చిట్లిపోతున్నంత బాధ కలుగుతున్నా లెక్క చేయకుండా అలాగే బిగించి పట్టుకొని అటూ ఇటూ పొరలాడుతున్నాడు.

షాడో వెనుకే ఆ ప్రదేశానికి వచ్చింది కెటీనా. అతను అవతలికి విసిరిన వేటకత్తిని పట్టుకొని అవకాశం కోసం చూస్తూ, వారి చుట్టూ తిరుగుతున్నది.

కొండచిలువ షాడో నడుం చుట్టూ తన శరీరాన్ని పెనవేసింది. ఆ వత్తిడికి షాడో పక్కటెముకలు పెట పెట లాడాయి. ఇక ఎంతోసేపు తట్టుకోవటం కష్టం అని తెలుసుకున్నాడు. పళ్ళు కొరుకుతూ శక్తినంతా చేతుల్లోకి తెచ్చుకొని కొండచిలువ తలను నేలకేసి నొక్కాడు.

అది గమనించిన కెటీనా ఒక్క గంతులో అతన్ని సమీపించింది. వేటకత్తిని ఎత్తి దెబ్బమీద దెబ్బగా కొండచిలువ తలమీద పది దెబ్బలు వేసింది.

తలమీద పడినప్పుడల్లా తోకతో షాడో తొడలమీద చరుస్తున్నది కొండచిలువ. షాడో తొడలు చచ్చుపడినట్లు అయిపోయాయి. పన్నెండో దెబ్బకి దాని తల తెగగొట్టగలిగింది కెటీనా.

రక్తం పిచికారీలో నుంచి వెలువడినట్లు వేగంగా వెలికి వచ్చి షాడో వంటినిండా చిమ్మింది.

మెల్లిగా అతని చుట్టూ వున్న దాని శరీరం వదులైపోయింది. ఎగిసి పడుతున్న గుండెలతో, చచ్చు పడిన అవయవాలతో , ఆ ప్రదేశంలో నుంచి అవతలకు జరిగాడు షాడో. కదిలే ఓపిక లేక అలాగే కనులు మూసుకుని పరుండిపోయాడు.

ఏవో ఆకులు తెచ్చి, పిగ్మీజాతి మనిషి పాదానికి కట్టుకట్టింది కెటీనా.

పావుగంట తరువాత తేరుకున్నాడు షాడో. లేచి ఆ వ్యక్తిని పరామర్శించాడు.

"యూ బిగ్ మాన్. ప్లెంటీ స్ట్రాంగ్.....మి మేక్ బిగ్ మాన్ హేపీ!" నీరసంగా నవ్వుతూ అన్నాడా వ్యక్తి.

అతని భాషలో ఏదో అన్నది కెటీనా. అతని జవాబు విని షాడోవైపు తిరిగింది.

"ఇతను జాంబెసీ తెగకు చెందిన పీగ్మీ. మన గ్రామంలో కొంతకాలం వున్నాడు. అందువల్ల కొంచెం ఇంగ్లీషు వంటబట్టింది."

"ఏదో ఒకటిలే....ఇకనైనా.... ఇంటికి జాగ్రత్తగా చేరుకోమ్మని చెప్పు" అన్నాడు షాడో.

వినోదంగా నవ్వుతూ తల అడ్డం తిప్పింది కెటీనా .

"మిస్టర్ షాడో.... ప్రాణదానం చేసిన వారి ఋణం తీర్చుకోనిదే, మరో పని ప్రారంభించారు జాంబెసీ అటవికులు. నువ్వు వద్దన్నా, తిట్టినా, కొట్టినా, నిన్ను వదలడితను. నీకు సాయం చేసిగాని వెనుతిరగాడు."

అభ్యంతరం చెప్పటానికి ఓపిక లేక అంగీకరించి లేచాడు షాడో. కొండచిలువ గొడవ మూలంగా అతను శక్తి హరించుకుపోయింది. ఆ రోజుకు విశ్రాంతి తీసుకోవటం మంచిదనే నిర్ణయించింది కెటీనా.

ఎలాగూ... చీకటి పడకముందే ప్రయాణాన్ని విరమించి విశ్రాంతి తీసుకోవటానికి సురక్షిత స్థలం చూసుకోవాలి.

"కటారీ.... చితుకులమంట చెయ్యి ఇప్పుడే వస్తాను" ఆ పీగ్మీ పేరు తెలుసుకున్న కెటీనా అతన్ని ఆదేశించి పొదలలోకి పోయింది.

అరగంట తరువాత పెద్ద అడవి కోడిని చంపి భుజం మీద వేసుకొని వచ్చింది. చెకుముకి రాయి సాయంతో మంటవేసి రెడీగా వున్నాడు కటారి. అడవి కోడిని శుభ్రంచేసి నిప్పులమీద కాల్చాడు.

వేట కత్తితో కొన్ని పొదలను నరికి వాటి రెమ్మలతో మెత్తటి పక్కను తయారు చేసుకున్నాడు షాడో.

కటారీ అందించిన మాంసపు ముక్కలను ఆరగించి ప్రక్కమీద మేను వాల్చాడు.

అలసిపోయి వుండటం వల్ల వెంటనే గాఢమైన నిద్ర పట్టింది. ఒక రాత్రివేళ మెలకువ వచ్చి చూశాడు.

చితుకుల మంట ఆరిపోయి ఉంది. దానికి ఒకవైపు కటారి కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు. రెండవవైపు నేలమీద పడుకొని గాఢ నిద్దురలో వుంది కెటీనా.

షాడో తనవంక చూడగానే ఉలిక్కిపడి కనులు తెరిచాడు కటారి. తెల్లటి పళ్ళన్నీ కనిపించేలా ముఖమంతా నోరు చేసుకొని నవ్వాడు.

"మీ వాచ్..... బిగ్ మాన్ స్లీప్ ....మీ గుడ్ వాచ్...." అన్నాడు షాడో వేటకత్తిని ఎత్తి భుజంమీద పెట్టుకుంటూ .

నవ్వుకుంటూ కనులు, మూసుకున్నాడు షాడో. రెండు క్షణాల్లో మరొకసారి గాఢమైన నిద్దురలోకి జారిపోయాడు.

## 4

ఆకుల మధ్యగా సూటిగా వచ్చి షాడో ముఖంమీద పడింది ఒకే ఒక సూర్యకిరణం. మరుక్షణం నిద్రలేచి కూర్చున్నాడు షాడో. పది అడుగుల దూరంలో కటారి బాసిపట్టు వేసుకొని కూర్చుని వున్నాడు. కెటీనా కోసం వెతికాయి షాడో కళ్ళు.

"వాటర్.... ప్లెంటీ క్లీన్ .... బిగ్ మాన్...." పొదలకేసి చేయి వూపుతూ అన్నాడు కటారి.

అతని భావాన్ని అర్థం చేసుకున్నాడు షాడో. బద్ధకంగా వళ్ళు విరుచుకుంటూ పొదలకేసి బయలుదేరాడు. పొదల వెనుక చిన్న సెలయేరు వున్నది. దాని వడ్డున వత్తుగా పెరిగి వున్నాయి అనేక రకాల ఫలవృక్షాలు. కెటీనా నేల రాలిన పళ్ళను ఏరి పరికిణీలో పడి కట్టుకున్నది.

ఆమెను చూడగానే అదిరిపడ్డాడు షాడో. కళ్ళు నులుముకుని మరొకసారి చూసి చిన్నగా నవ్వాడు.

చివ్వున తల ఎత్తింది కెటీనా. షాడోని చూడగానే చిరునవ్వు నవ్వింది.

ఒక్క పరికిణి తప్ప మరో నూలుపోగు కూడా ఆమె శరీరం మీద లేదు. బేర్‌గా ఉన్న ఆమె వక్షోజాలు - అతి ప్రయత్నం మీద తన దృష్టిని మరలించుకున్నాడు షాడో.

"అరణ్యంలోకి పోయినకొద్దీ.... నా ఆటవిక లక్షణాలు బయట పడతాయని చెప్పానుగా!" షాడో తడబాటును ఆసక్తితో గమనిస్తూ అన్నది కెటీనా.

షాడో గొంతుకు ఏదో రాయిలాంటి వస్తువు అడ్డుపడినట్లు మాటలు అతి కష్టం మీద వస్తున్నాయి.

"అరణ్యంలో అడుగు పెట్టనే కూడదు - అడుగుపెట్టిన తరువాత మా ఆచారాలను పాటించకపోవటం - ఈ అరణ్యాన్నే అగౌరవ పరిచినట్లు అవుతుంది" మెల్లిగా అన్నదామె.

"డోన్ట్ వర్రీ బేబీ... నువ్వు యిలా వుంటేనే బాగుంటుంది. పరికిణీ మాత్రం దేనికీ ? అదికూడా తీసేస్తే అచ్చు దేవకన్యలా వుంటావు "

షాడో మాటలు విన్న మరుక్షణం చేతిలో వున్న పండునొకదాన్ని బలంగా అతని మీదికి విసిరింది కెటీనా. ముందే జాగ్రత్తపడ్డాడు షాడో. ఎగిరి సెలయేటి లోకి డైవ్ చేశాడు.

ఫలాలను ఏరటం ఆపి వడ్డున కూర్చున్నదామె. మాటి మాటికీ ఆమె మెడక్రింది వైపు పరుగులు తీస్తున్న చూపుల్ని అతి ప్రయత్నం మీద మరలించుకుంటూ స్నానం చేయసాగాడు షాడో.

“మిస్టర్ షాడో! నువ్వొక సీక్రెట్ ఏజెంట్‌వనీ మనుష్యుల ప్రాణాలు తీయడంలో మొనగాడివని నాకు చెప్పారు. ఆ మాటలు విని నీ మీద ఒక విధమైన చులకన భావాన్ని ఏర్పరుచుకున్నాను. కానీ కటారిని రక్షించటంతో నీ నిజ స్వరూపం నాకు కనిపించింది. నువ్వు తీసే ప్రాణాలకంటే కాపాడే ప్రాణాల సంఖ్యే ఎక్కువ అని నాకు అర్థం అయింది.” మృదు మధుర స్వరంతో మెల్లిగా అన్నది కెటీనా.

షాడో వదనం సిగ్గుతో ఎర్రబడింది స్నానం చేయటం ఆపి ఒడ్డుమీదికి వచ్చాడు. “నా పేరు రాజు.... శత్రువులకు మాత్రమే షాడోని” అంటూ కాంప్ వైపు బయలు దేరాడు.

కెటీనా ఏరి తెచ్చిన ఫలాలను ఆరగించి ప్రయాణం ప్రారంభించారు. విల్లు అంబులను తను మోసుకు వస్తానని పంతం పట్టాడు కటారి. ఎంతోసేపు గొడవచేసి షాడో అందుకు అంగీకరించేసరికి ఏనుగు ఎక్కినంత సంబరపడిపోయాడు.

కెటీనా ముందు నడుస్తూ దారి చూపుతుండగా షాడో, కటారి ఆమెను అనుసరించారు.

కొంతదూరం పెళ్ళిన తరువాత ఉన్నట్లుండి ఒక చోట ఆగిపోయిందామె. వెంటనే రెండు అంగల్లో ఆమెను సమీపించాడు షాడో.

వారు ప్రయణిస్తున్న కాలి బాటకు కొద్ది దూరంలో పొదలచాటున పచ్చగడ్డి బాగా నలిగివుంది.

ఎవరో అక్కడ విశ్రాంతి కోసం ఆగారు. ఎవరై వుంటారు ? గిబ్బన్? “కావచ్చు రాజు.... మనం అనుసరిస్తున్న కాలిబాట వీరి మూలంగానే ఏర్పడి ఉంటుంది. ఈ ప్రాంతాల్లోనే జాంబెసీ నది వుంది. దాన్ని మనం క్రాస్ చెయ్యాలి. ఆ పని యిక్కడే చేస్తే బాగుంటుంది” తన అభిప్రాయాన్ని వెల్లడించింది కెటీనా.

“దెన్ వై దిస్ వెయిటింగ్? వెళ్ళి క్రాస్ చేద్దాం” యధాలాపంగా అన్నాడు షాడో.

“మరి గిబ్బన్? అతను మనముందే ప్రయాణిస్తున్నాడు” సందేహంగా అంటున్న కెటీనా భుజం పట్టుకొని ముందుకు నెట్టాడు షాడో.

“డోన్ట్ వర్రీ బేబీ. నీ డ్యూటీ దారి చూపించటం. నా డ్యూటీ అడ్డుపడిన వారిని హతమార్చటం.”

అతని కళ్ళల్లోకి చూసే ధైర్యం లేక ముందుకు దారితీసింది కెటీనా.

ఆమెకు రెండు అడుగుల దూరంలో అడుగులు వేస్తూ ఆ పరిసరాలను జాగ్రత్తగా పరీక్షించి చూస్తున్నాడు షాడో.

గిబ్బన్ తమకు అడ్డు తగలక మానడు. అందుకు సిద్ధపడి వుండకపోతే ప్రమాదం తప్పదు.

ఉన్నట్లుండి అతని దృష్టి రెండువందల అడుగుల దూరంలో కనిపిస్తున్న శాపిలిన్ చెట్లమీదికి ప్రసరించింది.

సమ్ థింగ్ యీజ్ రాంగ్....ముందు ఏదో ప్రమాదం పొంచి వుంది. షాడో అంతరంగం హెచ్చరించటం ప్రారంభించింది.

"కెటీనా - - - ఒక్క క్షణం" అనబోయాడు. అదే సమయంలో కాలి బాట ప్రక్కనే వున్న పొదలలో నుంచి రెండు జింకలు బయటికి వచ్చాయి. ముందుకు వస్తున్న కెటీనాను గమనించి బెదిరి వెను తిరిగాయి.

వాటిని చూడగానే మెరుపులా కటారి చేతిలోని విల్లు అంబుల్ని అందుకొని వాటిని అనుసరించింది కెటీనా.

"కెటీనా.... ఆగు ... ముందుకు పోవద్దు" అని అరిచాడు షాడో.

అతని మాటలు వినిపించుకోకపోగా మరింత వేగంగా పరిగెత్తటం ప్రారంభించిందామె.

ఒక్కసారిగా వేగం హెచ్చించాడు షాడో. నాలుగు అంగల్లో ఆమెను సమీపించి జుట్టు పట్టుకొని వెనక్కి గుంజాడు.

బాధతో కెటీనా ముఖం వికృతంగా తయారయింది. పిడికిళ్ళు బిగించి షాడో ముఖంమీద మోదింది.

ఫట్ మన్న శబ్దం ఆ ప్రదేశంలో ప్రతిధ్వనించింది. అదిరిపడి అటు చూసింది కెటీనా.

ఆమె అనుసరించ ప్రయత్నించిన జింక నడుములు విరిగి, నిర్జీవంగా గాలిలో ప్రేలాడుతోంది.

కెటీనా ముఖం పాలిపోయింది. బెదురు కళ్ళతో షాడో వంక చూసింది.

గిబ్బన్ తయారుచేసిన ట్రాప్ అది. శాపిలిన్ చెట్లను వంచి వుచ్చును నేలమీద ఆకుల చాటున మరుగు పరిచాడు. ఆ వుచ్చు మీద బరువు పడిన మరుక్షణం వంగి వున్న శాపిలిన్ వృక్షం వేగంగా లేస్తుంది. వుచ్చులో ఇరుక్కున్న ప్రాణి పైన అడ్డంగా వున్న చెట్ల కొమ్మలకు గుద్దుకొని ప్రాణాలు కోల్పోతుంది.

తను మృత్యువుకు ఎంత సమీపంలోకి వెళ్ళి తిరిగి వచ్చిందో తెలుసుకునేసరికి కెటీనా శరీరం జలదరించింది. జింక ఆ వుచ్చు మీది

నుంచి జంప్ చేసి అవతలకు పోయినట్లయితే కెటీనా తప్పకుండా అందులో చిక్కుపడి ప్రాణాలు పోగొట్టుకుని వుండేది.

ఆమె చేతిలోని విల్లంబులను కటారికి యిచ్చి - ఈ సారి షాడో ముందు నడవటం ప్రారంభించాడు.

మరో అరగంట గడిచిన తరువాత అనుకోని విధంగా ఎదురుపడి వారిని ఆశ్చర్యపరిచింది జాంబెసీ నది.

“నది ఒడ్డునే ఐదు మైళ్ళదూరం వెళితే ఒక కర్ర వంతెన వుంది. మనం అక్కడ క్రాస్ చేద్దాం....” ఉరుకులూ పరుగులూ పెడుతూ ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిని చూస్తూ అన్నది కెటీనా.

రెండు క్షణాలు యోచించి తల అడ్డం తిప్పాడు షాడో. గిబ్బన్ ఆ వంతెన దగ్గరికి పోయి వుంటాడు. దారిలోనే తమ మీద హత్యా ప్రయత్నం చేసినవాడు.....ఆ కర్ర వంతెనను.... తమ కోసం వుంచుతాడా?

కెటీనా ఏదో చెప్పబోయి ఆగిపోయింది. కటారి ఎందుకో తటపటాయించటం మొదలుపెట్టాడు.

వారి ప్రవర్తన షాడోకు అవగాహన కాలేదు. ఏమిటన్నట్లు కటారి వంక చూశాడు.

గిరుక్కున వెనుతిరిగి పొదలలోకి పరుగెత్తాడు కటారి.

పది నిమిషాల తరువాత ఒక కుందేలును చంపి తీసుకువచ్చాడు.

"బిగ్ మాన్..... వాచ్...." అంటూ దాన్ని బలంగా నీటిలోకి విసిరాడు.

అది నీటిలో పడిన మరుక్షణం సుడిగుండంలో పడినట్లు గింగిరాలు తిరిగసాగింది. సుడిగుండాలు వున్నాయేమో అనుకున్నాడు షాడో. కాని కుందేటి శరీరం చుట్టూ ఎగిసి పడుతున్న నీటి తుంపరలను గమనించగానే అతని అభిప్రాయం మారిపోయింది. శరీరం జలదరించి.... మెడ మీది వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి.

రెండు అంగుళాల పొడవున్న నల్లటి చేపలు వందల సంఖ్యలో వచ్చి కుందేటి శరీరాన్ని చుట్టుముట్టాయి. క్షణాల మీద తెల్లటి బొమికెల గూడుగా మారిపోయింది కుందేలు. మెల్లిగా నీటిలో మునిగిపోయింది. అది నీటిని తాకిన ఇరవై క్షణాలలో అంతా పూర్తి అయిపోయింది.

"మై గాడ్... పిరానా! పిరానా ఫిష్!" అన్నాడు షాడో.

## 5

"అవును రాజా! పిరానా చేపలే " షాడో మాటలను పునశ్చరణ చేసింది కెటీనా.

జాంబెసీ అరణ్యంలో కెల్లా అతి ప్రమాదకరమైన జీవులవి. అడవి ఏనుగులు కూడా వాటి దెబ్బలకు తట్టుకోలేవు. జాంబెసీలో అడవి ఏనుగులు నివశించక పోవటానికి కారణం ఆ పిరానా చేపలే.

నడుము చుట్టూ చుట్టుకున్న వాటిని సవరించుకుంటూ ఆవలి వడ్డును పరికించాడు షాడో ఎత్తయిన చెట్లు నీటిని ఆనుకొని నిలబడి వున్నాయి. వాటికి త్రాటిని ముడి వేయగలిగితే..... తాటిమీదుగా నదిని దాటవచ్చు.

"కుందేలుకు పట్టిన గతి చూశావ్‌గా. ఎందుకీ కాలయాపన?" విసుగ్గా అన్నది కెటీనా.

షాడో ఆలోచనల నిండా గిబ్బన్ నిండి వున్నాడు. వంతెన అయిదుమైళ్ళ దూరంలో వుంది. అక్కడికి వెళ్ళటం - రెండు గంటల ప్రయాణం. గిబ్బన్ వంతెనను నాశనం చేసి వుంటాడు. అలా జరిగిన పక్షంలో తిరిగి నదిని దాటటం ఎలాగనే ప్రశ్న ప్రత్యక్షం అవుతుంది. అంతదూరం వెళ్ళి అక్కడ ఆలోచించేకంటే - ఆ పని ఇక్కడే చేయటం మంచిదని నిర్ణయించుకున్నాడు షాడో.

"ఆ వంతెన కాకపోతే.... మరొకటి. దానికి పదిమైళ్ళ అవతల మరో వంతెన వుంది. అక్కడ క్రాస్ చేద్దాం.... పద..." అని తొందర చేసింది కెటీనా.

నిలబడిన చోటినుంచి - అడుగు కదపలేదు షాడో. పిరానా చేపల గురించి అతను తెలుసుకున్న విషయాలు మెదడులో గిర్రున తిరుగుతున్నాయి. తినటానికి ఏది దొరికినా... నదిలో వున్న చేపలన్నీ అక్కడ గుమికూడతాయి. నీటిలో పడిన వస్తువును స్వాహా చేసి గాని.... మరో ఆలోచన చేయవు. వాటికి ఎరగా ఏదైనా జంతువును వదిలి ... ఆ వ్యవధిలో తను నదిని దాటితే ?

కటారి వంక చూసి గిబ్బన్ ఏర్పాటు చేసిన శాపిలిన్ బోను మీది జింకను తీసుకురమ్మని చెప్పాడు. తల వూపి పొదలలోకి పరుగు తీశాడు కటారి.

చేతులు కట్టుకుని, ఒక చెట్టును ఆనుకొని నిలబడి వుంది కెటీనా. ఆమె కళ్ళల్లో షాడో తప్పు చేస్తున్నాడన్న భావం కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది.

‘‘కెటీనా డియర్... ఇక్కడ నదిని దాటితే.... మనకు బోలెడంత శ్రమ తగ్గతుంది. టైం కలిసివస్తుంది. పిరానా జింకను తినేలోపున... నదిని దాటగలను’’ అన్నాడు షాడో నడుముకు చుట్టివున్న త్రాటిని వూడదీస్తూ.

‘‘ఇంపాసిబుల్... నువ్వు సగం దూరం కూడా పోకముందే అవి జింకను తినేస్తాయి. వెంటనే నిన్ను ఎటాక్ చేస్తాయి. అనవసరంగా ప్రాణాలు పోగొట్టుకుంటావు.’’

జింకను భుజాలమీద వేసుకుని రోజుకుంటూ వచ్చాడు కటారి.

‘‘గుడ్.... కటారీ ప్లెంటీ స్ట్రాంగ్’’ మెచ్చుకున్నాడు షాడో.

కటారి ముఖం విప్పారింది. రొమ్ము విరుచుకొని నిలబడ్డాడు.

చిటికెన వేలంత లావున, వంద అడుగుల పొడవు వుంది షాడో వెంట తెచ్చినతాడు. నైలాన్‌తో చేయబడింది కావటం వల్ల దృఢంగానూ, లైట్‌గానూ వుంటుంది.

ఒక కొనను వద్దునే వున్న చెట్టుబోదెకు బిగించి, రెండవ కొనను నడుముకు కట్టుకోవటం ప్రారంభించాడు షాడో.

‘‘గివ్ యిట్.... నేను పోతాను....’’ షాడో చేతిలో నుంచి త్రాటిని లాక్కుని నదివైపు తిరిగింది కెటీనా.

షాడో కనుబొమ్మలు ముడిపడ్డాయి. ఆమె దృష్టిలో తనకు అరణ్యం గురించి ఏమీ తెలియదన్నట్లు కనిపిస్తోంది. ‘‘కెటీనా’’ అని గద్దిస్తూ తాటిని ఆమె చేతిలోనుంచి ఊడలాక్కున్నాడు.

‘‘రాజూ... మర్యాదగా తాడును నాకివ్వు....’’ కోపంగా అన్నదామె.

మౌనంగా రోప్‌ని నడుముకు కట్టుకున్నాడు షాడో.

"నిన్ను గైడ్ చేసి క్షేమంగా పని పూర్తి చేయిస్తానని మాట యిచ్చాను. గైడ్‌గా నేనే ముందు పోతాను" మొండిగా అతనికి అడ్డు నిలబడింది కెటీనా.

"నువ్వు ఎక్కడికీ పోవు. ఇక్కడే వుంటావు. నీ గైడ్ కబుర్లు కటారికి చెప్పు. నదిని దాటవచ్చు అన్నానని కోపగించి, దాటలేమని నిరూపించడానికేగా నువ్వు బయలుదేరింది! గైడ్ లాగా మాట్లాడటంలేదు. ఆడదానిలా మాట్లాడుతున్నావు."

"యూ బ్లడి - ఫూల్" నిప్పులు కురిపిస్తూ షాడో మీద విరుచుకు పడింది కెటీనా. "నదిని దాటటం అసంభవం అనగానే నీ మగతనం దెబ్బతిన్నది. నా మాటలు తప్పని నిరూపించటానికి బయలుదేరావ్ ."

"నా మగతనం దెబ్బ తినలేదు డార్లింగ్ - నోరు మూసుకోకపోతే నీ పిర్రలు దెబ్బతింటాయి. "

షాడో మాటలతో కెటీనా కోపం తారాపథానికి చేరింది. మెరుపులా ముందుకు దూకి అతని వేటకత్తిని వరలో నుంచి బైటకు లాగింది. దానితో షాడో నడుముకు బిగించుకున్న నైలాన్ త్రాటిని తెగగొట్టటానికి ప్రయత్నించింది.

ఆమె కంటె వేగంగా కదిలాడు షాడో. కుడిచేతిని కత్తిని అడ్డం పెట్టి ఎడమ చేత్తో గడ్డం మీద గుద్దాడు.

పెద్ద దెబ్బ కాదది. అయినా కెటీనా మారుమాట లేకుండా స్పృహ తప్పి పడిపోయింది. ఆమె కింద పడక ముందే పట్టుకొని - నెమ్మదిగా నేలమీదికి చేర్చాడు షాడో.

కటారి నోరు తెరుచుకొని చూస్తున్నాడు. నీటి అంచున నిలబడి అతనికి సైగ చేశాడు షాడో.

వెంటనే జింకను భుజాలమీదికి ఎత్తుకొని బలంగా నదిలోకి విసిరాడు కటారి.

జింక శరీరం నీటిని తాకిన మరుక్షణం పిరానాలు ఎటాక్ చేశాయి. ప్రవాహంలో పడి కొట్టుకొని పోకుండా, పడిన చోటునే నిలబెట్టి ఫలహారం చెయ్యసాగాయి.

ఒక్క క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా ఎగిరి నీటిలోకి దూకాడు షాడో ప్రవాహానికి ఎదురు ఈదకుండా, నీటివాలున ఆవతలికి జారిపోకుండా నిట్టనిలువుగా బారలు వేస్తూ వేగంగా అవతలి వడ్డు వైపు దూసుకుపోయాడు.

ఉన్నట్లుండి "బిగ్... మాన్ గో.... గో...." అని హై పిచ్‌లో అరవటం ప్రారంభించాడు కటారి.

షాడో మెడ వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. భుజం మీది నుంచి వెనక్కు చూశాడు.

పిరానాలు సగం జింకను స్వాహా చేశాయి. పది క్షణాలు ముందు నిండుగా కనిపించిన జింక.... సగం వరకు ఎముకల గుట్టగా మారిపోయింది.

వెనక్కు చూడటం ఆపి శక్తినంతా కూడగట్టుకొని వేగంగా యీదసాగాడు షాడో. ఎంత బారలు వేసినా.... ప్రవాహం అతన్ని ముందుకు పోనీయటం లేదు. వెనక్కు తోసేస్తున్నది.

షాడో మూడువంతులు దూరం వెళ్ళేసరికి పిరానాలు జింకను పూర్తిగా తినేశాయి. మాంసం హరించుకుపోయిన బొమికలు మెల్లిగా నదీ గర్భాన్ని చేరుకున్నాయి.

అతి ప్రయత్నం మీద ప్రవాహాన్ని దాటి వడ్డును ఆనుకొని వున్న నిలువ నీటిలోకి వెళ్ళాడు షాడో. రెట్టించిన పట్టుదలతో మరింత వేగంగా యీదసాగాడు.

అదే సమయంలో అతన్ని గమనించాయా పిరానా చేపలు. తెల్లటి పళ్ళు కనపడేలా నోళ్ళు తెరుచుకొని ఒక్కసారిగా అతని మీదికి వచ్చి పడ్డాయి.

వీపు మీది నీటిలోని కదలికను పసికట్టి మరింత వేగంగా యీదటం ప్రారంభించాడు. పిరానాలు ఎక్కడ వున్నాయో వెను తిరిగి చూసి తెలుసుకోవలసిన అవసరం లేకపోయింది.

తొడల మీద గుండు సూదులు గ్రుచ్చినట్లు బాధ ప్రారంభమయింది. ఒక్క క్షణం - మరొక్క క్షణంలో పూర్తిగా ఆక్రమించుకుంటాయి. పిరానా చుట్టు ముట్టడం అంటే..... మొసళ్ళ నోటిలో చిక్కుపడటం లాంటిది. ముఖం ముందుకు వచ్చిన పిరానా చేపలను చూసి అప్రయత్నంగా నీటి లోపలికి డైవ్ చేశాడు. అంతమాత్రం చేత అవి వదలలేదు. మరింత వేగంగా అతన్ని అనుసరించాయి.

తన పని ఆఖరైపోయిందని గ్రహించాడు షాడో. కెటీనా అన్న మాటలు అక్షర సత్యాలయినాయి... నదిని దాటటం అసంభవం.

నీటిలో మునిగి రెండు అడుగులు లోతుకు పోగానే కాలికి నేల తగిలింది. మరుక్షణం షాడో ప్రాణాలు లేచి వచ్చాయి. నేలను బలంగా తన్ని రాకెట్ లాగా నీటిమీదికి దూసుకువచ్చాడు.

అదే వూపులో తలకిందులుగా డైవ్ చేసి రెండు గజాలు అవతలికిపోయి పడ్డాడు. ముందుకు జారిన చేతులకు ఒక బండరాయి తగిలింది. అక్కడ మోకాలి లోతు మాత్రమే వుంది. కాళ్ళు మడిచి చిన్న ఫ్రాగ్ జంప్‌తో నేలమీదికి చేరుకున్నాడు.

పిరానాలన్నీ ఆ ప్రదేశంలో గుమి కూడాయి. వాటిని చూసి అసహ్యంగా నొసలు విరుస్తూ నడుముకు కట్టుకున్న తాటిని ఊడతీశాడు షాడో.

తొడల మీద సూదులు పెట్టి పొడిచినట్లు కొన్ని వందల రక్తపు బిందువులు ప్రత్యక్షమయ్యాయి.

ఆ బాధనూ, ఎగసుకువస్తున్న ఆయాసాన్నీ లక్ష్యపెట్టకుండా నైలాన్ త్రాటిని ఒకచెట్టు బోదెకు బిగించి కట్టాడు.

"బిగ్ మాన్ స్ట్రాంగ్... ప్లెంటీ స్ట్రాంగ్" అని అరుస్తూ కెటీనా భుజం పట్టుకొని అదరగొట్టేస్తున్నాడు కటారి.

ఆ గొడవకు కెటీనా లేచి కూర్చుంది. షాడో పిడికిలి తగిలిన ప్రదేశం నల్లగా కమిలిపోయింది. బాధగా ముఖం విరుస్తూ లేచి నిలబడింది.

సామానంతా వీపుకు కట్టుకొని త్రాటిమీద కోతిలా వేలాడుతూ యువతలి వడ్డుకు చేరుకున్నాడు కటారి.

అతని భుజం తట్టి "కటారీ....ఎఫిషియంట్ మంకీ!" అని మెచ్చుకున్నాడు షాడో.

కటారి తరువాత కెటీనా వచ్చింది. నేలను చేరుకోగానే ఎగిరి క్రిందికి దూకి షాడో మీదికి వచ్చింది.

"చూశావా డియర్...నదిని దాటాను...." వెక్కిరించాడు షాడో.

పళ్ళు కొరుకుతూ పిడికిలితో అతని దవడమీద కొట్టింది కెటీనా.

వెల్లకిలా పడ్డాడు షాడో.

"నువ్వు కాదన్న పనిని చేశానని అసూయగా వుందా డార్లింగ్? అసూయ ఆడవాళ్ళకు ఎక్కువ. దారి చూపించే వారికి కాదు"అన్నాడు పడినచోటునుంచి లేవకుండా.

కెటీనా దృష్టి అతని పాంటుమీద రక్తపు మరకలపై పడింది. ఆమె కోపం మాయమైపోయింది. నీరు నిండిన కళ్ళతో అతని ప్రక్కన మోకరించి "రాజు....ప్లీజ్...యింకెప్పుడూ యిలాంటి సాహసాలు చెయ్యకు" అన్నది గద్గద స్వరంతో.

నీటిలో కదులుతున్న పిరానాలను చూస్తూ "ఈ సారి నువ్వు దిగమని సెత్తీ నోరు కొట్టుకున్నా దిగను డియర్....ఒకసారి అయిన శాస్తి చాలు...." అంటూ లేచి నిలబడ్డాడు .

"నదిని దాటటం వల్ల గిబ్బన్ కంటె ఒకరోజు ముందుకు వచ్చాం. మరే విధమైన అడ్డంకులూ ఎదురు పడకుండా వుంటే రేపు సాయంత్రానికి ఎలక్ట్రానిక్ బ్రెయిన్ పడిన ప్రదేశానికి చేరుకుంటాం...."

షాడో వెంట తెచ్చిన మాప్‌ని చూస్తూ చెప్పింది కెటీనా.

పిరానాలు చేసిన గాయాలకు ఆకు పసర్లు అంటించుకొని రెడీ అయ్యాడు షాడో.

కెటీనా ముందు నడిచింది. ఆమె వెనుక కటారి....తరువాత షాడో. వారు వంద గజాల దూరంలో కూడా పోకముందే - భూకంపం వచ్చినట్లు దడ దడ లాడిపోయింది భూమి.

వికృతమైన ధ్వనులు వినిపించటం ప్రారంభించాయి.

రాతి బొమ్మలా నిలబడి పోయింది కెటీనా. రెండు క్షణాలపాటు ఆ శబ్దల్ని విని గిరుక్కున వెనుతిరిగింది.

అప్పటికే ముంచుకువస్తున్న ప్రమాదాన్ని గుర్తించి పక్కదార్లు వెతుకుతున్నాడు షాడో. కెటీనా చెయ్యిపట్టుకొని పొదలకు అడ్డం పడ్డాడు. వారివెనుకే ఎగిరి గంతులు వేస్తూ అనుసరించాడు కటారి.

వారు ముగ్గుర్నీ గమనించి మరింత వేగంగా తరుముకుంటూ వచ్చింది - ఒక పెద్ద అడవి పందుల మంద. అడ్డువచ్చిన పొదలను

మొదలు కంటా విరిచి పారేస్తూ.... భయంకరంగా అరుస్తూ వారిని వెంబడించింది.

## 6

"మై గాడ్ రాజు! వీటికి అందితే.... మన ఎముకలు కూడా కనిపించవు" ఆయాసంతో వగరుస్తూ అంది కెటీనా.

"ఇంకా అందలేదుగా... అందిన తర్వాక యిక, ఆలోచించాల్సిన అవసరమే ఉండదు... మాట్లాడకుండా ముందుకే చూడు" అంటూ పరుగుదీస్తున్నాడు షాడో.

ఫర్లాంగు దూరం సాగిందా పరుగు పందెం. ఎదురుగా కనిపించిన రాతిగుట్టలను చూడగానే అటు దారి తీశాడు. షాడో. అడవి పందులు అత్యంత సమీపంలోకి వస్తుండగా ఆ గుట్టల్ని సమీపించి ప్రాణాలు దక్కించుకున్నారు.

నున్నగా.... పది అడుగుల ఎత్తున వున్నాయి ఆ రాతి బండలు. వాటి మీదికి వెళ్ళటం అడవి పందులకు అసాధ్యమై పోయింది. రాతిబండల ముందు ఆగి ఆ ప్రాంతాన్నంతా ధ్వంసం చేయసాగాయి.

ఒక బండ రాయి మీద కూర్చుని 'ఒకటి రెండు .... మూడు ' అంటూ వాటిని లెక్క పెట్టాడు షాడో. మొత్తం రెండు వందల ఇరవై నాలుగు పందులు - నూట యాభై పిల్లలు వున్నాయి.

అవి అక్కడ వుండగా తాము రాతి బండల మీదినుంచి క్రిందికి దిగలేరు. దిగిన మరుక్షణం కెటీనా అన్నట్లు తమను నంచుకుతింటాయి.

"నదిని దాటి అందరి కంటె ముందు నిలబడ్డామని సంతోషిస్తుండగా ఇదెక్కడి బాధరా.... బాబూ" అనుకుంటూ పళ్ళు కొరికాడు నిస్సహాయంగా.

అతని భావాలను గమనించినట్లుంది. నాలుగు అడుగుల ఎత్తున్న వరాహం ఒకటి, గుర్రమని శబ్దం చేస్తూ ముందు కాళ్ళు ఎత్తి రాతి బండమీద ఆనించింది.

"కమాన్.... యూ సన్ ఆఫ్ ఎ బిచ్....రా" అంటూ దాని ముఖం మీద తన్నాడు షాడో.

తల్లక్రిందులుగా కిందపడిందా వరాహం. షాడో పట్టుజారి ముందుకు తూలాడు. కటారి మెరుపులా చేయి అందించి అందుకోకపోయినట్లయితే కింద గంతులు వేస్తున్న ఆ పంది కోరలకు బలి అయిపోయేవాడు.

"బిగ్ మాన్... ప్లెంటీ యాంగ్రీ ! గో టేక్ బాత్......" అన్నాడు కటారి బొటన వేలితో వెనక్కు చూపిస్తూ.

అటూ చూశాడు షాడో. ఆ రాతి బండల వెనుక చిన్న సెలయేరు వున్నట్లు నీటి చప్పుడు వినవస్తోంది. అప్పుడే అటు అడుగులు వేసి ఒక రాతి చాటున మాయం అయింది కెటీనా.

మెల్లిగా లేచి ఆమెను అనుసరించాడు షాడో.

ముగ్ధ మనోహరంగా వుంది అక్కడి వాతావరణం. స్వచ్ఛమైన నీరు రాతి బండల మధ్యనుంచి మెలికలు తిరుగుతూ నురుగులు వెలువరిస్తూ ప్రవహిస్తోంది.

నగ్నంగా ఆ నీటిలో పడుకొని వుంది కెటీనా . షాడో వంకచూసి మత్తెక్కించేలా నవ్వింది.

ఆ పైన షాడో చుట్టూ వున్న ప్రపంచం, బాధలు... అన్నీ మాయమైపోయాయి. ఆమె శరీరం, సవాలు చేస్తున్నట్లు కనిపిస్తున్న ఆమె వక్షోజాలు మాత్రమే కనిపించసాగాయి.

ఎగిరి ముందుకు డైవ్ చేశాడు. ఆత్రంగా అతన్ని అందుకున్నదామె.

## 7

ఎనిమిది గంటలసేపు రాతి బండలచుట్టూ కాంప్ వేసి కూర్చుంది అడవి పందుల మంద.

ఏమీ చేయలేక నీరసంగా వాటివంక చూస్తూ కూర్చున్నాడు షాడో.

మెల్లిగా వారిని గురించి మరిచిపోయాయవి. ఆ ప్రాంతాన్ని నాగలితో దున్నినట్లు ముట్టెలతో తిరగదోడి సర్వనాశనం చేసి ముందుకు కదిలాయి.

"రాజు... మనం మళ్ళీ నది దగ్గరికే వెళ్ళాలి. నదిఒడ్డున ప్రయాణం చేయటమే మంచిది"అని అనుసరిస్తూన్న మార్గాన్ని చూస్తూ అన్నది కెటీనా.

అర్థం కానట్లు ముఖం పెట్టాడు షాడో.

"మనం వెళ్ళవలసిన దారినే వెళ్ళాయి పందులు. వాటి వెనుక ప్రయాణించటం చాలా ప్రమాదం" వాటి వంక చూపిస్తూ చెప్పిందామె.

వరాహ జాతినంతటిని కలిపి తిట్టుకుంటూ నదివైపు అడుగులు వేశాడు షాడో. వాటి మూలంగా అందరికంటె పన్నెండు గంటలు వెనుకపడ్డారు.

నదిని సమీపిస్తూ - ఉన్నట్లుండి వెనక్కు గెంతింది కెటీనా. పెదిమలమీద వేలుంచుకుని నిశబ్దంగా వుండమని హెచ్చరించింది. పొదలను అడ్డుచేసుకొని ఆమె చూపించిన వైపు చూశాడు షాడో. ఎక్కడలేని నీరసమంతా వచ్చి ఆవరించుకోగా నేలమీద చతికిలపడ్డాడు.

నది ఒడ్డున మూడు డింగీలు ఆగివున్నాయి. వాటిలో వచ్చిన ఝరియా ఏజెంట్లు తమ సామానుల్ని వడ్డుకు చేరవేసుకుంటున్నారు.

వారి కంటపడి మరికొన్ని తలకాయ నొప్పుల్ని తెచ్చుకోవటం షాడోకు యిష్టం లేకపోయింది. ఆ ప్రదేశానికి దూరంగా జరిగి మరోదారి వెతుక్కోవాలని ఆలోచించసాగాడు.

అదే సమయంలో కెవ్వుమని వినవచ్చిందొక కేక. షాడో శరీరం ఝల్లుమన్నది. అటువైపు చూశాడు.

జెట్ విమానాలను మించిన శబ్దం చేస్తూ ఝరియా ఏజెంట్లను కమ్ముకుంటున్నాయి కొన్ని కీటకాలు.

"బిగ్ మాన్.... గో డేంజర్.... ప్లెంటీ డేంజర్" భయంగా అన్నాడు కటారి.

రాక్షసి కందిరీగలవి. మాములు కందిరీగల కంటె నాలుగు రెట్లు పెద్దవి. ఇంజక్షన్ సూదులలాగా కనిపిస్తున్నాయి వాటి కొండెలు. సామన్లను ఒడ్డుకు వేయటంలో పొరపాటున వాటి తుట్టెను కదిలించినట్లున్నారు. కోపంతో ప్రతీకారం చెయ్యటానికి బయలుదేరాయి.

ఆరుగురు ఝరియా ఏజెంట్లు పారిపోవాలని ప్రయత్నించారు. ఎటుతిరిగితే అటు ప్రత్యక్షమౌతున్న ఆ కీటకాలను వదిలించుకోవటం కష్టం అయింది వారికి.

కర్నల్ కుర్షీద్ వాటి తాకిడికి తట్టుకోలేక నేల కూలిపోయాడు. బాధతో మెలికలు తిరిగిపోతూ, హీనస్వరంతో అరిచి కేకలు పెడుతున్నాడు.

తల భయంకరంగా వాచిపోయిన ఏజెంట్ ఒకడు నదిలోకి పరుగుతీశాడు. నీటిలో మునిగినవాడు తిరిగి పైకి లేవలేదు. డింగీలను చూసి అక్కడ కాపువేసి వున్న పిరానా చేపలు ఆనందంగా అతన్ని ఆరగించేశాయి.

కందిరీగల మోతలతో, ఝురియా వారి దీనారావాలతో ఆ ప్రదేశం దద్దరిల్లిపోయింది.

ఆ పైన కామ్‌గా నిలబడలేక పోయాడు షాడో. "డామిట్ దిసీజ్ టూ మచ్...." అంటూ అటు పరుగుతీశాడు.

పాంటుజేబులో చెయ్యిపెట్టి చేతికి అందిన రెండు ఇనుప గోలీలను బయటికి తీశాడు. వాటిమీద వున్న బుడిపెలను నొక్కి బలంగా గాలిలోకి విసిరాడు.

సి.ఐ.బి. స్పెషల్ డిపార్ట్‌మెంట్ తయారు చేసిన మాస్టర్ పీసెస్ అవి. బుడిపెలు నొక్కిన మరుక్షణం పిచ్చుకల లాగా గాలిలోకి గిరికీలు కొట్టటం ప్రారంభించాయి. వాటికి వున్న సన్నటి రంధ్రాలలో నుంచి తెల్లటి పొగ సుడులు తిరుగుతూ ఆ ప్రాంతాన్ని ఆవరించుకోసాగింది.

ఆ పొగ కంగిరీగలను బెదరకొట్టింది. కొన్ని ప్రాణాలు కోల్పోయి నేలవాలిపోయాయి. మిగిలినవన్నీ ఆ ప్రాంతాల్లో లేకుండా అరణ్యంలోకి పారిపోయాయి.

ఝురియా ఏజెంట్లు బాధగా మూలుగుతూ నేలమీద పొర్లిగింతలు పెడుతున్నారు.

వెంటనే వారిని సమీపించాడు షాడో. బెల్టుకు అమర్చివున్న తోలు పెట్టె లోనుంచి హైపోడెర్మిక్ యింజెక్షన్స్ తీసి వారికి ఇచ్చాడు. మరికొంత సేపటికి వారి మూలుగులు అంతరించాయి. వాపులు మాత్రం అలాగే ఉన్నాయి.

కటారికి సైగచేసి వారి సామనుల్లో ఉన్న కాన్వాస్ క్లాత్‌తో చిన్న గుడారం వేయించాడు షాడో. బెడ్డింగులు ఊడతీసి, పక్కలు పరిచి, ఝురియా వారినందర్నీ అందులో పడుకోపెట్టాడు.

షాడో చేసిన ఇంజెక్షన్స్ పని చేయటం ప్రారంభించాయి. బాధలు కొంతవరకూ ఉపశమించగా మత్తు నిద్రలోకి జారిపోయారు వారందరూ.

వారి దుప్పట్లను బయటికి లాగి అందర్నీ కవర్ చేశాడు షాడో. అప్పటికి సూర్యాస్తమయం అయింది. ఉన్న చోటునుంచి ఒక్క అడుగుకూడా ముందుకు వేయకముందే ఒక రోజు వృధా అయిపోయింది.

గుడారం ముందు చచ్చి పడివున్న కందిరీగల్ని చూసి అసహ్యంగా నొసలు విరుస్తూపోయి నది ఒడ్డున కూర్చున్నాడు. అంతవరకూ మౌనంగా అతను చేస్తున్న పనులను గమనిస్తున్న కెటీనా మెల్లిగా సరసన చేరింది.

ఆమె వంక చూసి నిర్లిప్తంగా నవ్వాడు షాడో - "చంపవలసిన శత్రువులను ప్రాణదానం చేసి టైం వేస్ట్ చేస్తున్నానని అనుకుంటున్నావా?" అన్నాడు.

"లేదు రాజూ... అలా అనుకోనేలేదు. మానవత్వం నిండుగా వున్నవారు చేయవలసిన పని నువ్వూ చేసావ్. ఝురియా వారిని రక్షించటంలోనే నీ గొప్పతనం బయటపడింది" అన్నది కెటీనా - అతని భుజం మీద తల ఆనించి.

ఆమె నడుం చుట్టూ చేతులు చుట్టి ఆలోచనలలో మునిగి పోయాడు షాడో.

నిజమే! తను ఎన్ని చావులనో చూశాడు. ఎంతోమందిని తన చేతులతోనే చంపాడు. మనిషి ఎంత గొప్పవాడైనా మృత్యువు ముందు తల వంచక తప్పదు. మృత్యువు వెన్నుతట్టి పిలిచిననాడు - అందంగా ఆనందంగా ఆహ్వానించారు కొందరు, భయంతో బిగుసుకుని మరణించారు మరికొందరు.

ఎవరు చంపారు, ఎలా చంపారు అన్న మానవుడి అభిప్రాయాలతో అవసరంలేదు ఆ మృత్యువుకు, కాని మనిషి మనిషిని చంపటం వేరు - ప్రకృతి మనిషిని చంపటం వేరు.

ప్రకృతి విధ్వంసకాండ మొదలు పెడితే మానవుడు తట్టుకోలేడు. ఆ సమయంలో శత్రుత్వాలు మరిచి, భేదాభిప్రాయాలను పూడ్చి పెట్టి మానవజాతి అంతా ఏకం కావాలి. అప్పుడే ప్రకృతి సృష్టించిన ప్రమాదాన్ని ఎదుర్కోవటం సాధ్యపడుతుంది.

అదే ఆలోచనతో అప్రయత్నంగా ఝురియా వారికి సాయం చేశాడు తను. తోటి మానవుల్ని ఆదుకున్నాడు.

ఎప్పటికైనా మానవులందరూ శతృత్వాలు మరిచి, ఏక కుటుంబంగా కలిసి మెలిసి తిరగాలంటే - మానవ మేధస్సుకు అందని మానవతీత శక్తి మానవుల మీద దాడి చేయాలి. అప్పుడే అందరూ ఒకటి అవుతారు.

క్రమంగా చీకట్లు వారిని చుట్టుముట్టాయి. పగలంతా నిద్రించిన అరణ్యం బద్దకంగా వళ్లు విరుచుకుంటూ మెలకువ తెచ్చుకుంది.

# 8

తెల్లవారింది. గుండెలమీద తలపెట్టి పడుకున్న కెటీనాను లేపి - లేచి నిలబడ్డాడు షాడో. కటారి అంతకు ముందే లేచాడు కాబోలు - చితుకులు మంటచేసి చలి కాచుకుంటున్నాడు.

షాడో లేవగానే టెంట్లు వైపు చేయి చూపించాడు.

మోచేతులు మీద లేచి, చుట్టూ చూస్తున్నాడు కర్నల్ కుర్షీద్. ముఖం వాపు కొంతవరకూ తగ్గింది. అయినా భయంకరంగానే కనిపిస్తున్నాడు.

షాడోను చూడగానే అతని కళ్ళు కృతజ్ఞతాపూర్వకంగా మెరిశాయి.

"మిస్టర్ షాడో....నీ ఋణం తీర్చుకోవటం చాలా కష్టం. థాంక్యు వెరీమచ్ " అన్నాడు.

అతనికి వాపులను గురించి జాగ్రత్తలను వివరించి బయటికి వచ్చాడు షాడో. కటారి, కెటీనా ప్రయాణానికి సిద్ధంగా నిలబడి వున్నారు.

"మానవాళికి సోదర భావంతో సాయం చేసే పని అయిపోయింది. ఇక మన సంగతి మనం చూసుకోవాలి. గెట్ రెడీ " అంటూ కటారికి సైగ చేశాడు.

ఝురియా వారి ఆయుధాలన్నిటిని కట్ట కట్టి ఒక చెట్టు మీద చిటారి కొమ్మలకు వేలాడతీశాడు కటారి.

ఝురియా ఏజెంట్లు మూడు డింగీల మీద వచ్చారు, రెండింటిని చిల్లులు పెట్టి నదీ గర్భానికి పంపించాడు షాడో. మూడవ దానిని తమ కోసం వుంచుకున్నాడు.

కెటీనాను అందులో కూర్చోపెడుతుండగా కర్నల్ కుర్షీద్ గుడారం నుంచి బయటికి వచ్చాడు.

"వాటిజ్ దిస్ మిస్టర్ షాడో?" అన్నాడు ఆ తతంగాన్ని గమనించి.

డింగీని ప్రవాహంలోకి తోసి నవ్వుతూ చేయి వూపాడు షాడో.

"మై డియర్ కర్నల్ ….మీ ఆయుధాలు చెట్టుమీద వున్నాయి. వాటిని తీసుకొని నెమ్మదిగా రండి. తొందర ఏమీ లేదు. రాజును పోగొట్టుకోవటం కంటె నాలుగు బంట్లను వదులుకోవటం మంచిది. ఈ రౌండ్‌లో గెలుపు నాది " అన్నాడు.

చదరంగం చేతకాని కెటీనా ప్రశ్నార్థకంగా చూసింది.

"కర్నల్‌కి తెలుసు, అర్థం చేసుకుంటాడు. చదరంగంలో ప్రతి ఆట తనే గెలవటం మాటలు కాదని ఇప్పటికైనా తెలుసుకొని వుంటాడు " నవ్వాడు షాడో.

బలంగా తెడ్డు వేస్తూ డింగీని నీటి వాలుకు పోనీయసాగాడు కటారి.

# 9

ఆ రోజు నది మీదినే ప్రయాణించి , చీకటి పడే సమయానికి వడ్డుకు చేరుకున్నారు. డింగీని నీటిలోకి వదిలి, అరణ్యంలో ఒక అరమైలు దూరం ప్రయాణించారు.

అప్పటికి పూర్తిగా చీకటి పడింది. దట్టంగా వున్న పొదల మధ్య శుభ్రం చేసి విశ్రమించటానికి అనువుగా ఏర్పాట్లు చేశాడు కటారి. ఆహారం సంపాదించుకునే వ్యవధి లేక పోవటం వల్ల, ఖాళీ కడుపులతోనే నిద్రించారు.

తెల్లవారు ఝామున మెలుకువ వచ్చి లేచి కూర్చున్నాడు షాడో.

ఇంకా చీకట్లు పొదలను ఆవరించుకునే వున్నాయి. ఎముకలు కొరికే చలిగాలి వీస్తున్నది.

కటారి తయారు చేసిన చితుకుల మంట ఆరిపోయింది. తిరిగి మంట చేద్దామని లేవబోయిన షాడో - చీకటిలో నుంచి తన పేరు వినరావటంతో ఎలా వున్నవాడు అలాగే కూర్చుండిపోయాడు.

"మిస్టర్ షాడో.... కదిలావంటే నీ గైడ్ ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి." అని హెచ్చరించింది ఒక వికృత కంఠం.

కళ్ళు చిట్లించుకొని చీకటిలోకి చూశాడు షాడో. నాలుగు అడుగుల దూరంలో పడుకొని వుంది కెటీనా. ఆమె గొంతుకు ఆనించబడిన వేటకత్తి అంత చీకటిలోనూ, అతి స్పష్టంగా కనిపిస్తోంది.

ఆమెకు మరికొద్ది దూరంలో విశ్రమించిన కటారి గుండెలకు ఒక రైఫిల్ ఆనించి వుంది.

వెంటనే బెల్టులో వున్న రివాల్వర్‌ని పొదల కిందికి తోశాడు షాడో. డాగర్‌ని తీసి ఆకులలో దాచాడు.

వెలుగు వచ్చిన తరువాత అతని ముందుకు వచ్చాడు - గిబ్బన్.

వికృతంగా నవ్వుతూ షాడో హంటింగ్ నైఫ్‌ని తీసి అవతల పడవేశాడు. బెల్టుకు అమర్చివున్న తోలు పెట్టెను పరిశీలించాడు. అందులో వున్న సాధన సామాగ్రి ఎందుకో అతనికి అర్థం కాలేదు....

"నీ అధికారులు యిచ్చిన సూపర్ ఎక్విప్ మెంట్ కాబోలు....నీకు ఎలక్ట్రానిక్ బ్రెయిన్‌ని చూసే యోగం లేదు. కనీసం వీటినైనా చూసుకొని సంతోషించు" అంటూ ఆ తోలు పెట్టెను షాడో పాదాల ముందుకు గిరాటు పెట్టాడు.

దాని అందుకొని బెల్టుకు తగిలించుకున్నాడు షాడో. కనుచివరనుంచి ఎదిరించటానికి అవకాశం వుంటుందేమో అని చూశాడు.

అది గమనించి కెటీనాను బలవంతంగా లేపి తన ముందు నిలబెట్టుకున్నాడు గిబ్బన్. కత్తిని దాచి చిన్న పిస్టల్‌ని బయటకు తీశాడు. ఉన్నట్లుండి ఎదురు తిరిగిందామె. అతని చేతిని గట్టిగా కొరికింది.

బాధతో గిబ్బన్ గిలగిల లాడిపోయాడు. అతని ప్రక్కనే వున్న సహచరుడు ముందుకు వచ్చి కెటీనా ముఖం మీద పొడిచాడు పిడికిలతో. ఆ దెబ్బకు షాడో దగ్గరికి వచ్చి పడిందామె.

ఆమెను లేవతీసి గుండెలుకు హత్తుకున్నాడు షాడో. పెదవులు తెగి రక్తం స్రవిస్తూ వుండటం చూడగానే కోపంతో భగ్గుమన్నది అతని హృదయం.

మెరుపులా పక్కకు దూకి ఎగిరి గిబ్బన్ గుండెల మీద తన్నాడు. ప్రయోజనం వుండదని తెలుసు, కాని, ఆ క్షణం అటువంటింది.

గిబ్బన్‌తో వచ్చిన కొండజాతి వారిలో ఒకడు చేతిలో వున్న రైఫిల్‌ని తిరగవేసి షాడో మెడమీద బాదాడు.

స్పృహ తప్పి నేల వాలిపోయాడు షాడో.

తిరిగి కళ్ళు తెరిచే సరికి ఎదుట గిబ్బన్ గాని, అతని అనుచరులు గాని ఎవరు లేరు.

లేవటానికి ప్రయత్నించాడు. చేతులు వెనక్కి విరిచి కట్టబడి వున్నాయి. పాదాలు కూడా రెండూ దృఢంగా బంధించబడి వున్నాయి.

కెటీనా, కటారీలు కూడా అదే మాదిరిగా బంధించబడి వున్నారు. వారి ముగ్గరు నడుములకు కలిపి పెద్ద మోకు కట్టబడి వుంది. దాని రెండవ కొన పది అడుగుల దూరంలో వున్న చెట్టు బోదెకు బిగించి వుంది.

దిగులుగా కూర్చున్న కెటీనా, కటారీల వంక చూసి నవ్వుతూ "మరేం పరవాలేదు. యింకో రెండు మూడు గంటల్లో యీ బంధనాలు వదిలించుకుందాం " అన్నాడు.

"లాభం లేదు రాజు.....గిబ్బన్‌కి తెలిసే మనల్ని యిలా బంధించాడు. మనకు పాతిక అడుగుల దూరంలో నీటిగుంట వుంది. అడవి జంతువులన్నీ నీటి కోసం యిక్కడికే వస్తాయి. జాగ్వార్ కూడా యిక్కడికే వస్తుంది. దాని బారినుంచి మనం బయట పడలేం" అన్నది కెటీనా హీన స్వరంతో.

నడుములకు కట్టిన తాడు ఎందుకో షాడోకు అప్పుడు అర్థం అయింది. తాము దొర్లుకుంటూ ఆ ప్రదేశం నుంచి పారిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు గిబ్బన్.

జాగ్వార్‌ని చూసి కదలకుండా కూర్చోవటం అసాధ్యం. అది కదిలే జంతువుల్నే వేటాడుతుంది. అందుకే పెద్ద మోకును వుపయోగించాడు.

“కదిలితే గదా జాగ్వార్ చంపేది! కదలకుండా కూర్చుంటే?” తనలో తనే అనుకుంటున్నట్లు పైకే అనేశాడు షాడో.

“నీకు తెలియదు రాజు! జాగ్వార్ ఎదురుగా వస్తే కదలకుండా నిలబడటం అసాధ్యం. మానవుడెవడూ అలా నిలబడలేడు” నొక్కి చెప్పింది కెటీనా.

వారిద్దరి ముఖాల్లో ప్రతిబింబిస్తున్న నిరాశా నిస్పృహల్ని గమనించాడు షాడో. ఆ సమయంలో తాను ఎంత ధైర్యం చెప్పినా ప్రయోజనం వుండదని గ్రహించాడు. అరగంట సేపు ఆ బంధనాలు వదిలించుకోవాలని తంటాలు పడ్డాడు. ప్రయోజనం లేకపోగా .... ఆయాసం ముంచుకు వచ్చింది.

ఆ ప్రయత్నం మాని రాబోయే ప్రమాదాన్ని ఎదుర్కోవటానికి సిద్ధపడ్డాడు. కెటీనా కటారీలను తన వెనుక కూర్చోమని ఆదేశించి జాగ్వార్ కోసం ఎదురు చూడటం ప్రారంభించాడు.

మరికొంత సేపటికి అడవి జంతువులు ఒకటొకటిగా నీటిగుంట దగ్గరికి రావటం ప్రారంభించాయి.

దుప్పులు, జింకలు కుందేళ్ళు, అడవి పందులు, ముళ్ళపందులు, కోతులు - ఆఖరికి రెండు పాములు, ఒక కొండ చిలువ అటుగా వచ్చాయి.

మొదట అక్కడ వున్న మానవుల వునికిని గ్రహించి సందేహించినా, షాడో ఆదేశాలను అనుసరించి ఎటువంటి కదలికా కనిపించకపోవటం వల్ల తాపీగా నీరు త్రాగి వెళ్ళిపోయాయి.

కెటీనా, కటారీలు కదలకుండా కూర్చోవటంతో షాడో హృదయంలో ఆశా తరంగాలు వుద్భవించాయి. జాగ్వార్ వచ్చే వేళ అయింది. అది వచ్చినప్పుడు కూడా వారు అలాగే కూర్చుని వుంటే !

సడన్‌గా వినిపించింది జాగ్వార్ గర్జన, అదిరి పడ్డారు కెటీనా, కటారీలు.

"ఫర్ గాడ్ సేక్.... కదలకండి... మరేం భయం లేదు" తగ్గుస్వరంతో వారిని హెచ్చరించాడు షాడో.

ఠీవిగా అడుగులు వేస్తూ పొదలో నుంచి అక్కడికి వచ్చింది జాగ్వార్. వారిని గమనించనట్లే ముందుకు పోయి నీరు త్రాగింది. విలాసంగా తోక ఆడిస్తూ వెనుతిరిగి షాడో ముందుకు వచ్చి నిలబడింది.

షాడో గుండెలు వేగంగా కొట్టుకోవటం ప్రారంభించాయి. ముఖం మీద స్వేద బిందువులు జారి కళ్ళల్లో పడసాగాయి. కనురెప్పలు ఆర్పటానికి కూడా వీలు లేదు. అలాగే సూటిగా జాగ్వార్ కళ్ళల్లోకి చూస్తూ కూర్చుండిపోయాడు.

పావుగంట సేపు అక్కడే నిలబడింది జాగ్వార్. తల తిప్పకుండా అతని వంకే చూసింది. కనురెప్పలు కూడా ఆర్పకుండా చూపుకు చూపు సమాధానం యిచ్చాడు షాడో.

విసుగుపుట్టి తోకను నేలకేసి బాది పెద్దగా గర్జించింది అది. దానికి కూడా సమాధానం యివ్వలేదు షాడో. తృప్తి పడింది జాగ్వార్. వెనుతిరగటానికి రెండు అడుగులు ప్రక్కకు వేసింది.

అంతవరకూ ఊపిరి బిగబట్టికూర్చున్న కెటీనా.... అది తమ మీదికి దూకటానికి అలా వెనక్కి జరిగిందని భ్రమపడింది. వెర్రిగా అరుస్తూ లేవటానికి ప్రయత్నించింది.

వెంటనే చెవులు చిల్లులు పడేలా గర్జిస్తూ ఆమె మీదికి లంఘించింది జాగ్వార్.

బాణంలా లేచాడు షాడో. భుజంతో జాగ్వార్‌ని పక్కకు తోసి దాని మీద పడ్డాడు.

గుడ్డ బొమ్మను విసిరినట్లు అతన్ని అవతలకు విసిరింది జాగ్వార్. అయినా వదలలేదు షాడో. మళ్ళీ ముందుకు దూకి దాని కాళ్ళకు అడ్డు పడ్డాడు.

కెటీనా విషయం వాయిదా వేసి తన దృష్టిని అతని మీదికి మరలించింది జాగ్వార్. భయంకరంగా గర్జిస్తూ పంజా ఎత్తి అతని తల మీద కొట్టబోయింది.

అదే సమయంలో పెద్ద శబ్దంతో పేలిందొక రైఫిల్. నిప్పులు వెదజల్లుతూ వచ్చి జాగ్వార్ తలలో దిగబడింది దాని బుల్లెట్.

షాడో మీది నుంచి జంప్ చేసి విలవిలా తన్నుకుంటూ ప్రాణాలు వదిలింది జాగ్వార్. ఆశ్చర్యంగా అటుచూశాడు షాడో.

పొగలు కక్కుతున్న రైఫిల్‌తో కర్నల్ కుర్షీద్ పొదలోనుంచి బయటికి వచ్చాడు.

"హల్లో మిస్టర్ షాడో! జాగ్వార్‌ని చూపులతో నిలబెట్టటం .... యింతవరకూ నేను చూడలేదు. హేట్సాఫ్ టు యువార్ విల్ పవర్.... బై ది బై ....మీకు యీ గతి పట్టించింది ఎవరు ? చైనా వాళ్ళా?" అన్నాడు.

నది ఒడ్డునే ప్రయాణం చేస్తూ, షాడో బృందపు జాడలను పసికట్టి అటు వచ్చాడు. షాడో, విశ్రాంతి తీసుకున్న ప్రదేశంలో గిబ్బన్ జాడలు

కనిపించాయి. అతను వదిలి వెళ్ళిన షాడో హంటింగ్ నైఫ్, విల్లు అంబులు ఎదురైనాయి. షాడో జాగ్వార్‌ని నిలబెట్టి వుంచిన సమయంలో ఆ ప్రాంతానికి వచ్చాడు. షాడో ఏం చేస్తాడో చూద్దామని ఆఖరి క్షణం వరకు ఆగి - అతని మొండి సాహసాన్ని కనులారా చూశాడు కర్నల్ కుర్షీద్.

తన అనుచరులను హెచ్చరించి షాడో, కెటీనా, కటారీలను దగ్గిర దగ్గిరగా కూర్చోపెట్టి కట్టేయించాడు.

"మిస్టర్ షాడో! యింకో అరగంటలో మీరు బంధనాలను వదిలించుకోవచ్చు. మీ హంటింగ్ నైఫ్ పొదల దగ్గిర వుంది. దాన్ని తీసుకొని ప్రయాణం ప్రారంభించే సరికి మరో గంటా వృథా అవుతుంది. ఈ లోపల చీకటి పడుతుంది. మేము నిరాటంకంగా నీకన్నా ముందు ఎలక్ట్రానిక్ బ్రెయిన్ వున్న ప్రదేశాన్ని చేరుకుంటాం" అంటూ షాడోకు శాల్యూట్ చేశాడు. అతని బంధనాలను మరొక్కసారి పరిశీలిస్తూ. "నీ ఒంకే కొంత వరకూ చెల్లు వేయగలిగాం మిస్టర్ షాడో.... ఈ రౌండ్‌లో గెలుపు నాది" అని వెనుతిరిగాడు.

వారిని పొదలలోకి పోనిచ్చి బంధనాలను వదిలించుకోవటానికి ప్రయత్నించటం ప్రారంభించాడు షాడో.

కర్నల్ అన్నట్లు ఒక గంట కాదు - ఆ తాళ్ళు వూడేసరికి రెండు గంటలు పట్టింది.

"రాజూ..... యిందాక అలా అరిచినందుకు నన్ను క్షమించు. అది నా మీదికే దూకబోతున్నాడని భయపడ్డాను" షాడో మెడను కౌగలించుకొని బుగ్గల మీద ముద్దు పెట్టుకుంటూ అన్నది కెటీనా.

"బిగ్ మాన్.... ప్లెంటీ స్ట్రాంగ్.... జాగ్వార్ నో ఫియర్. ప్లెంటీ స్ట్రాంగ్....." గంభీరంగా మెచ్చుకున్నాడు కటారి.

## 10

అందరికన్నా వెనుక పడవలసిన వచ్చిందన్న కోపంతో.... తెల్లవారగానే ప్రయాణం ప్రారంభించాడు షాడో. అతనే ముందుకు నడిచాడు పొదలను వేటకత్తితో విరగదీస్తూ. ఆ రోజు అతన్ని అనుసరించలేక పోయారు కెటీనా, కటారి.

మధ్యాహ్న సమయంలో విశ్రాంతి తీసుకోవటానికి అనువైన స్థలాన్ని వెతుకుతూ ప్రయాణ వేగాన్ని తగ్గించాడు షాడో.

ఒక ఖాళీ స్థలంలోకి అడుగుపెట్టి - కాలికి ఏదో మెత్తగా తలగటం వల్ల ఎగిరి అవతలకు దూకాడు.

అతని వెనుకే వస్తున్న కెటీనా - అది చూసింది. భయంతో కెవ్వున అరిచింది.

పది శవాలు దారికి అడ్డంగా పడి వున్నాయి. పది శవాలకు తలలు లేవు. తలలు వుండవలసిన స్థానంలో ఎర్రటి రక్తపు మడుగులు వున్నాయి.

"రాజూ! వీళ్ళు.... వీళ్ళు.... చైనా ఏజెంట్లు కదూ?" భయం భయంగా అన్నది కెటీనా.

శవాలు ధరించి వున్న దుస్తులు అదే విషయాన్ని వెల్లడిస్తున్నాయి. అయితే షాడో గమనించిన విషయం మరొకటి వుంది. శవాలలో రిగామార్టిస్ యింకా ప్రారంభం కాలేదు.

కెటీనా చెయ్యిపట్టుకొని పొదలలోకి లాక్కుపోయాడు.

"హెడ్ హంటర్స్ యుద్ధాన్ని ప్రకటించినట్లుంది - అది వారి పనే. సందేహం లేదు. నీ అభిప్రాయం ఏమిటి ?" అడిగింది కెటీనా.

"వాళ్ళు యుద్ధం ప్రకటించినా, ప్రకటించకపోయినా మనకు మంచే చేశారు. చైనా వాళ్ళు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయారు. మనకు కాంపిటీషన్ ఒక పాలు తగ్గింది" చుట్టూ చూస్తూ జవాబు యిచ్చాడు షాడో.

షాడో మనస్తత్వం కెటీనాకు అర్థం కాలేదు. కందిరీగల బారిన పడినవారిని రక్షించేటందుకు ఉరుకులూ పరుగులూ పెట్టిపోయాడు. జాగ్వార్‌ని పట్టి చేతులతో ఎదిరించాడు. ఇప్పుడు హెడ్ హెంటర్స్ దొరికిన వారిని దొరికినట్లు ఊచకోత కోస్తుంటే మంచిదంటున్నాడు. అసలు మతి వుందా! తన అభిప్రాయాలను షాడో ముఖం మీదే చెప్పాలని అనుకొన్నది. కాని అందుకు అవకాశం లభించలేదు.

చుట్టూ చూస్తున్న షాడో ఆమె చేయి నొక్కి, "సారీ కెటీనా... ఇందాక కాంపిటీషన్ ఒక పాలు తగ్గింది అన్నాను కదూ.... ఆ మాటలో చిన్న కరెక్షన్ వచ్చింది. ఒక పాలు కాదు...రెండు పాళ్ళు తగ్గబోతున్నది" అన్నాడు.

ఉలిక్కిపడి చూసింది కెటీనా. వారు నిలబడి వున్న పొద చుట్టూ కమ్ముకుంటున్న హెడ్ హంటర్స్‌ని చూసే సరికి ఆమె గొంతు ఎండిపోయింది.

చైనా ఏజెంట్ల తలలు నాయకుడి మెడలో వేలాడుతున్నాయి!! బరిశెలను పొదకేసి గురిపెట్టి నల్ల రాతి విగ్రహాలలాగా నిలబడ్డారు వారందరూ.

బెల్టు వెనుక వున్న రివాల్వర్ బయటికి కనిపించకుండా టక్ చేసిన షర్టును పాంటు మీదికి లాగుకున్నాడు షాడో. తాము అలా అంత తేలికగా బంధింపబడటం మంచింది కాదని... ఒక్కసారిగా ఎగిరి వారి మధ్యకు దూకాడు.

వారు ఆయుధాలను తన మీదికి తిప్పే లోపుగా... సందు చేసుకొని పొదలకు అడ్డం పడ్డాడు.

పెద్ద పెద్ద అరుపులు అరుస్తూ అతని వెంటాడారు హెడ్ హంటర్స్! బరిశెలు విసిరారు. బాణాలు వదిలారు. చేతికి అందిన రాళ్ళతో కొట్టారు. ఎంత చేసినా వారికి అందలేదతను. అరగంటసేపు వారిని ముప్ప తిప్పలు పెట్టి ... ఆఖరికి లొంగి పోయాడు.

బరిశె మొనలు అతనికి ఆనించి వెనక్కి నడిపించారు. హెడ్ హంటర్స్. మధ్యలోనే కెటీనా, కటారిలతో షాడోకు ఎదురయింది రెండవ గుంపు.

"రాజు! మీ చైనా స్నేహితులు వీళ్ళ గ్రామంలోకి పోయి, ఆడవారిని, పిల్లల్ని హింసించి నానా గొడవ చేశారట. వారి కొండ దేవత కొయ్య విగ్రహాన్ని మంటపెట్టి నాశనం చేశారట. వీరి కోపానికి కారణం అది" వారి మాటల్ని శ్రద్ధగా ఆలకిస్తూ కెటీనా తెలియచేసింది.

చచ్చి కూడా పగ సాధిస్తున్న చైనా వారిని మెచ్చుకోకుండా వుండలేకపోయాడు షాడో.

"అయితే మన తలకాయలు...యింకా మన మెడకాయల మీదే వున్నాయేం ?"చిలిపిగా అన్నాడు.

"ఇంకా ఎంతో కాలం వుండవు. మీ యిద్దర్నీ కొండ దేవతకు బలి యిస్తారట"

"మరి నిన్ను"

"నాకు ఇంకా అందమైన శిక్ష పడింది. ఈ రోజే ఆరుగురు యువకులు హెడ్ హంటర్స్ సైన్యంలో జాయిన్ అయ్యారట. ఆ శుభ సందర్భంలో నన్ను ఆ ఆరుగురికీ కానుకగా సమర్పించి, ఆ తర్వాత కొండ దేవతకు బలి ఇస్తారు."

కెటీనా మాటలు వింటూ, వీపుకు గుచ్చుకుంటున్న బరిశెలను గమనిస్తూ అడుగులు వేస్తున్నాడు షాడో. మెల్లగా రివాల్వర్ మీద చెయ్యి వేస్తూ "బేబి... నేను తప్పించుకోబోతున్నాను. ఈ రాత్రికి వచ్చి కలుసుకుంటాను. ధైర్యంగా వుండండి" అన్నాడు.

తలవూపింది కెటీనా.

చల్లగా రివాల్వర్‌ని బయటికి లాగి వెనక్కి తిప్పి పట్టుకున్నాడు షాడో. ఒక ఖాళీ స్థలంలోకి అడుగు పెట్టగానే కెటీనా, కటారీలను ముందుకు పోనిచ్చి ట్రిగ్గర్ నొక్కాడు.

బరిశె అతని నడుముకు ఆనించి నడుస్తున్న వ్యక్తి క్రింద పడిపోయాడు. మరుక్షణం అంతా గందరగోళం అయిపోయింది. రివాల్వర్స్ సంగతి తెలియని ఆ ఆటవిక జాతి అది చేసిన మోతకు బెదిరి నాలుగు దిక్కులకు చెల్లా చెదరయింది.

కొందరు కెటీనా, కటారీలను పట్టుకునే పొదలలోకి పరుగులు తీశారు.

మరొక బుల్లెట్‌ని వారి మధ్యకు పంపి మరొక్క సారి పరుగు అందుకున్నాడు షాడో. ఈ సారి నేలమీద కాదు - కోతిలా చెట్టు కొమ్మల మీద ప్రయాణం చేశాడు. చిటారు కొమ్మలకు పోవడం వల్ల క్రింద వున్న హెడ్ హంటర్స్‌కి కనిపించలేదు... చెట్లు ఎక్కిన వారు.... చాలా ఆలస్యంగా ఆ పని చేశారు.... వారు చెట్టు ఎక్కేసరికి ఆ ప్రదేశాన్ని వదిలి ఆరమైలు దూరం పారిపోయాడు షాడో.

## 11

చీకటి పడేదాకా చెట్ల కొమ్మల మీదే కాలక్షేపం చేసి..... బాగా చీకటి పడిన తరువాత కిందికి దిగి వచ్చాడు షాడో.

హెడ్ హంటర్స్ ప్రయాణించిన దిశను చూసి వుండటం వల్ల పెద్ద పెద్ద అడుగులు వేస్తూ వారిని అనుసరించాడు.

ఒక పెద్ద మైదానంలో వున్నది వారి గూడెం. అన్నీ ఆకులతో కట్టబడిన గుడిశెలు. గుడిశెలకు ఒక చివరగా... నల్లగా మసి బారివున్న కొండ దేవత విగ్రహం కనిపిస్తోంది. ఒక పెద్ద గుడిశె ముందు చాలా మంది ఆడవాళ్ళు గుమికూడి వున్నారు. వారిలో కొంత మంది కర్ణ కఠోరమైన గొంతులతో రాగాలు తీస్తున్నారు. వారిలో కొంత మంది చేతులు వూపుతూ, చిరతలు మోగిస్తూ తాళాలు వేస్తున్నారు.

'కెటీనాను ఆ ఆరుగురు దున్నపోతులకు అర్పించే ఉత్సవం కాబోలు' అనుకున్నాడు షాడో.

చీకటి మాటున మోకాళ్ళమీద పాకుతూ ఆ గుడిశె వెనుక భాగానికి చేరుకున్నాడు. లోపలి నుంచి ఎటువంటి శబ్దాలు వినబడక పోవడంతో, డాగర్ తీసి గుడిశె గోడలుగా కట్టి వున్న ఆకులలో రంధ్రం చేశాడు.

లోపల ఒక మూలన చిన్న చాపమీద కూర్చుని వుంది. కెటీనా విషాదంగా, తల మోకాళ్ల మీద ఆనించి నేల మీదికే చూస్తున్నది.

షాడో లోపలికి రావటం ఆమె గమనించలేదు.... చిన్నగా దగ్గాడు షాడో. అదిరిపడి తల ఎత్తింది "రాజూ!" అంటూ లేచి వచ్చి అతన్ని పెనవేసుకుంది.

"రావని అనుకున్నాను రాజూ.... నా పని ఆఖరే అనుకుంటున్నాను" అన్నది ఆనందంగా.

ఆమెను నిశ్శబ్దంగా వుండమని హెచ్చరించి, చేయవలసిన పనిని వివరించి తలుపుల ప్రక్కన నిలబడ్డాడు షాడో.

నవ్వుతూ తిరిగి చాప మీదికి వెళ్ళింది కెటీనా. అప్పుడే బయటనుంచి వినిపిస్తున్న పాటలు ఆగిపోయాయి. మగ కంఠాలు వినవచ్చాయి.

డాగర్‌ని యథాస్థానంలోకి చేర్చి రివాల్వర్ తీసి పట్టుకున్నాడు షాడో. రెండు నిమిషాల తరువాత తలుపులు తెరుచుకున్నాయి. ఒక పదహారేళ్ళ యువకుడు లోనికి వచ్చాడు కెటీనాను చూసి పళ్ళు బయటపెట్టి - ఆత్రంగా అటు అడుగులు వేశాడు.

అతను లోనికి రాగానే శాస్త్రంలో చెప్పినట్లు తలుపులు మూశారు బయట వున్నవారు. అంతవరకూ కదలకుండా నిలబడ్డాడు షాడో. తలుపులు మూత పడగానే ముందుకు దూకాడు .

రివాల్వర్‌ని వెనక్కి తిప్పి ఆ యువకుడి మెడమీద బలంగా గుద్దాడు. నిశ్శబ్దంగా నేల మీద పడిపోయాడతను. అతన్ని ఎత్తి ఒక మూల పడుకోబెట్టి కెటీనా వంక చూశాడు షాడో.

ఆ యువకుడు బలవంతగా తనను భంగపరచటానికి ప్రయత్నిస్తున్నట్లు కెవ్వున అరిచింది కెటీనా... గోల గోల చేయసాగింది.

రెండు నిమిషాలు ఆగి - చాలన్నట్లు సైగ చేశాడు షాడో కెటీనా నోరు మూత పడింది.

మరో పది నిమిషాల తరువాత రెండవ యువకుడు లోనికి వచ్చాడు. కెటీనా వైపు చూస్తుండగానే తలుపులు మూసుకున్నాయి. షాడో వెంటనే అతన్ని పడగొట్టి అతని సహచరుడి ప్రక్కన చేర్చాడు.

కెటీనా మళ్ళీ అరుపులు ప్రారంభించింది.

ఒకరి తరువాత ఒకరుగా మిగిలిన యువకులు అందరూ ... గుడిశె గోడ ప్రక్కన పడుకో పెట్టబడ్డారు.

"రాజూ! యిక నా వల్ల కాదు.... నటించటమే యింత భయంకరంగా వుంది..... నిజంగానే ఆ అడవి పందులు నా మీద పడితే యింకేలా వుంటుందో " ముఖానికి పట్టిన చెమటను తుడుచుకుంటూ అన్నది కెటీనా.

ఆమెతో గుడిశెలో నుంచి బయటకు వచ్చాడు షాడో. పాకుకుంటూ గూడెం చుట్టూ వున్న పొదల మధ్యకు వెళ్ళారు.

రివాల్వర్ ఆమె చేతిలో పెడుతూ "కెటీనా....నేను కటారి కోసం పోతున్నా. నేను వచ్చే దాకా యిక్కడే కూర్చో. ఏమయినా గొడవ జరిగితే అడవిలోకి పారిపోయి ప్రాణాలు దక్కించుకో. మళ్ళీ నీ జన్మలో ఎవరికీ గైడ్‌గా పని చేయకు " అని సలహా యిచ్చాడు షాడో.

చేతులు మెడచుట్టూ పెనవేసి పెదవులు అందుకుంది కెటీనా - "రాజు.... నీలాంటి వాళ్ళను కల్సుకోవటం నా జన్మలో జరగని పని, నువ్వు చెప్పినట్లే చేస్తాను " అంది.

నీడలలో నడుస్తూ కొండ దేవత విగ్రహం దగ్గరికి వెళ్ళాడు షాడో. అక్కడ ఒక హెడ్ హంటర్ నిలబడి వున్నాడు. షాడో ఆ ప్రదేశంలో అడుగు పెట్టేసరికి, అంతవరకూ మబ్బులు చాటున వున్న చంద్రుడు బైటికి వచ్చాడు.

ఆ వెలుగులో షాడోను గమనించాడతను, అరవటానికి నోరు తెరిచాడు. అతని ప్రయత్నం ఫలించలేదు. షాడో డాగర్ గాలిని చీల్చుకుంటూ ముందుకు వెళ్ళి, అతని గొంతులో దిగబడింది. నిశ్శబ్దంగా నేల మీద పడ్డాడతను. డాగర్‌కి అంటిన రక్తాన్ని అతని తలకే పులుముతూ

చుట్టూ చూశాడు షాడో. అతను వూహించినట్లే కొండదేవత విగ్రహం కాళ్ళకు బిగించబడి వున్నాడు. కటారి. డాగర్‌తో అతని బంధనాలను సడలించి పొదల దగ్గరికి లాక్కుపోయాడు షాడో. అంతవరకూ వారిని ఎవరూ గమనించలేదు.

“మీ ఇద్దరూ మాయం అయినట్లు ఇంకో పది పదిహేను నిముషాలలో వెల్లడి అవుతుంది. వెంటనే మిడతల దండులా వచ్చి పడతారు. మనం కనిపించేదాక అరణ్యంలోనే తిరుగుతూ వుంటారు” తన అభిప్రాయాన్ని వెల్లడించాడు షాడో.

“ఈ సారి కనిపించిన మరుక్షణం తలలు నరకటం తప్పని సరి” అందించింది కెటీనా.

“మనకు కొద్దిపాటి వ్యవధి కావాలంటే వాళ్ళ అటెన్షన్‌ని డైవర్టు చెయ్యాలి. అందుకు వీళ్ళ కొంపల్ని తగలబెట్టటం చాలా మంచి మార్గం ” జేబులోంచి లైటర్ తీసి పట్టుకుంటూ అన్నాడు షాడో.

అతని మాటలు అర్థం కాకపోయినా.... అసలు విషయాన్ని గ్రహించాడు కటారి. వెంటనే కొన్ని కొమ్మలు విరిచి మూడు దివిటీలు తయారు చేశాడు.

లైటర్‌తో వాటిని వెలిగించాడు షాడో. ముగ్గురూ మూడు దివిటీలను పట్టుకుని మూడు పక్కలకు పరుగు తీశారు.

మరుక్షణంలో ఆకుల గుడిశెలు అంటుకున్నాయి. ఫెట పెటార్భాటాలతో అగ్ని జ్వాలలు గూడెమంతా ఆక్రమించుకున్నాయి.

ఆడ మగ, చిన్న పెద్దా, ముసలీ ముతకా...అందరూ భయంతో అరుస్తూ ప్రాణాలు దక్కించుకునే ప్రయత్నాల్లో పడ్డారు. ఆ గొడవలో మాయమైన బంధితుల సంగతి వారికి పట్టలేదు.

తన పని పూర్తి చేసుకుని వెనుతిరిగాడు షాడో. అతను పొదల్లోకి వెళ్ళేసరికి కటారి, కెటీనాలు వచ్చి కలుసుకున్నారు.

అక్కడ ఆగకుండా అలాగే చీకటిలో ప్రయాణం చేశారు. తెల్లవారే సమయానికి పూర్తిగా అలసిపోయి ఒక చోట కూలబడి పోయింది కెటీనా. ఆమె ప్రక్కనే చతికిల పడి ఆయాసం అణుచుకోవటానికి విశ్వ ప్రయత్నం చేయసాగాడు షాడో.

"రాజా... రెండుగంటలు ఆగి వెళదాం...." అడగలేక అడుగుతున్న కెటీనాను చూసి జాలిపడింది అతని హృదయం.

కటారికి సైగ చేసి అలాగే నేల మీద మేను వాల్చాడు.

"మీ వాచ్....యూ గో స్లీప్లీ..." అన్నాడు కటారి.... కెటీనా షాడో రివాల్వర్ ని అతనికి యిచ్చింది. అది చేతిలోకి వచ్చేసరికి కటారికి బ్రహ్మాస్త్రం దొరికినంత సంతోషంగా వుంది.

నాలుగు గంటల పాటు నిద్రించాడు షాడో. తిరిగి లేచే సరికి బాగా వెలుగు వచ్చింది.

కెటీనాను లేపి తాము ఏ ప్రాంతంలో వున్నారో... తెలుసుకోగోరాడు. నిద్ర కళ్ళతో చుట్టూ చూసిందామె.

షాడో చూపించిన మాప్‌ని గుర్తుకు తెచ్చుకుంటూ "రాజూ ! మనం చేరవలసిన ప్రదేశం ఇదే. యీ ప్రాంతాల్లోనే మీ ఎలక్ట్రానిక్ బ్రెయిన్ పడి వుంటుంది." అన్నది.

## 12

కులకర్ణిగారు యిచ్చిన మాప్‌ని బయటికి లాగి నేల మీద పరిచాడు షాడో. కెటీనా దాన్ని జాగ్రత్తగా పరిశీలించి ఎలక్ట్రానిక్ బ్రెయిన్ పడి వుంటుందని వూహిస్తున్న ప్రదేశాన్ని చూపించింది.

"ఆల్ రైట్.... ముగ్గరం మూడు దిశల నుంచీ వెతుక్కుంటూ వద్దాం" అంటూ ఎందుకో తల పైకి ఎత్తి ఆకాశం వంక చూశాడు షాడో.

చెట్ల కొమ్మల సందుల నుంచి కనబడినంతా మేరా చాలా నిర్మలంగా వుంది. కాని షాడో అంతరంగం....అందుకు భిన్నంగా హెచ్చరించసాగింది. వాతావరణంలో మార్పు రాబోతున్నట్లు గ్రహించాడు.

"కెటీనా డియర్.... వర్షం వచ్చే సూచనలు అగుపిస్తున్నాయి...." అన్నాడు. ఆ మాట విన్న తరువాత కెటీనా, కటారీలు ఆ విషయాన్ని గమనించారు. వెంటనే ఖంగారుగా కటారీతో ఏమో అన్నదామె.

వేటకత్తి భుజం మీద వేసుకొని చెట్ల చాటుకు పరుగుతీశాడతను. షాడోకి వారి ఖంగారు అర్ధం కాలేదు.

"రాజు! జాంబెసీ అరణ్యాలలో వర్షం పడటం అంటూ జరిగితే - అది సామాన్యమైన వర్షం కాదు. కుంభవృష్టిగా వస్తుంది. మనం వెంటనే మంచి షెల్టర్ ఏర్పాట్లు చేసుకోవాలి. " చెప్పింది కెటీనా.

జాంబెసీ అరణ్యాల్ని గురించి పూర్తి వివరాలు తెలియక పోవటం వల్ల ఆమె మాటలు పూర్తిగా అర్ధం కాకపోయినా కటారికి చేయి అందించాడు షాడో.

పది అడుగుల పొడవున్న లావాటి కొమ్మల్ని చదరాకారంలో భూమిలో పాతారు. నేల మీదినుంచి నాలుగు అడుగుల ఎత్తున మంచెలా కట్టి, దాని మీద ఆకులతో పై కప్పు వేశారు.

తినటానికి పనికి వచ్చే పళ్ళు, ఫలాలు ఏరుకు వచ్చింది కెటీనా. మంచెమీద ఆకులు పరిచి, కూర్చునేటందుకు అనువుగా అరేంజి చేశాడు షాడో. వారి పని పూర్తి అయిన మరుక్షణం వచ్చి పడింది వర్షం.

కింద వున్న కటారీకి చేయి అందించి మంచె మీదికి లాగాడు షాడో. ఆకాశానికి చిల్లులు పడినట్లు ఎడ తెరిపి లేకుండా కురియసాగింది. కెటీనా మంచెను ఏర్పాటు చేయాలని అనటానికి కారణాన్ని అప్పుడు గ్రహించాడు షాడో.

ఆ వర్షానికి అరణ్య జీవులన్నీ బయట పడతాయి. ఆ సమయంలో నేలమీద వుండటం చాలా ప్రమాదం. అదీ కాక ఎడతెరిపి లేకుండా పడుతున్న నీటి జల్లు మూలంగా.... తల దాచుకోలేని వారికి పిచ్చి ఎక్కుతుంది.

"ఇలా ఎంతసేపు కురుస్తుంది ?" యధాలాపంగా అడిగాడు.

"చెప్పటం కష్టం రాజా! నాలుగు గంటల నుంచి, నాలుగురోజులు దాకా ఏకధారగా పడవచ్చు."

కెటీనా సమాధానం విని నిస్సహాయంగా భుజాలు ఎగరవేసి కూర్చున్నాడు షాడో. మంచె తయారు చేయటానికి రెండు గంటలు పట్టింది. నాలుగు గంటలు కురిసే వర్షానికి - రెండు గంటలు వేస్ట్ చెయ్యాల్సివచ్చింది.

కెటీనా గంభీరంగా వర్షపు చినుకుల వంక చూస్తూ కూర్చుంది. కటారి కూర్చునే కునికిపాట్లు పడుతున్నాడు.

చీకటి పడినా.... వర్షం తగ్గే సూచనలు కనిపించటంలేదు. ఉరుములూ మెరుపులతో యీదురుగాలి ప్రారంభమయింది. పెద్ద పెద్ద చెట్టు కొమ్మలు ఫెళ ఫెళారావాలతో విరిగి పడసాగాయి.

రాత్రి గడిచి వెలుగు వచ్చింది. వర్షం ఆగలేదు. జేబులు తడుముకున్నాడు షాడో. ఒకే ఒక పనామా సిగిరెట్ మిగిలివుంది. దాన్ని వెలిగించుకొని, పొగను గుండెలనిండా పీల్చుకుంటూ ఆలోచనలలో మునిగిపోయిన షాడో - ఉన్నట్లుండి వర్షం ఆగిపోవటం గమనించలేకపోయాడు.

ఎలా ప్రారంభమైందో - అలాగే హఠాత్తుగా ఆగిపోయింది. అంతవరకూ కర్ణ కఠోరమైన శబ్ధాలతో దద్దరిల్లిపోయిన జాంబెసీ అరణ్యం ఒక్కసారిగా భయంకరమైన నిశ్శబ్దంలో మునిగిపోయింది.

"థాంక్ గాడ్! శని విరగడ అయింది." అంటూ లేచి నిలబడింది కెటీనా. ఇంకేదో చెప్పబోయింది. ఆమె మాటలు ఆమె నోటిలోనే ఆగిపోయాయి.

మంచెకు వంద అడుగుల దూరంలో వున్న పొదలలో నుంచి ఒక వ్యక్తి పిచ్చిగా అరుస్తూ అక్కడికి వచ్చాడు.

బురదలో పడుతూ , లేస్తూ గుడ్డిగా అడుగులు వేస్తున్నాడు.

"మై గాడ్ రాజూ! అతను ఝురియా ఏజెంట్ కదూ?" అందోళనగా అన్నది కెటీనా.

అతన్ని చూసిన మరుక్షణం ఆ సంగతి గమనించాడు షాడో. అతని హృదయం జాలితో ద్రవించిపోయింది. వర్షం సంగతి తెలియక తల దాచుకోలేని అభాగ్యుడైన వ్యక్తి అతను.

అతన్ని మంచె మీదకు చేర్చుదామన్న ఉద్దేశ్యంతో కిందికి దిగబోయాడు. అప్పటికే ఆలస్యం అయిపోయింది.

ఝురియా ఏజెంట్ పోతున్న దారిలో చుట్టలు చుట్టుకొని వుందొక బ్లాక్ స్నేక్. ఎనిమిది అడుగుల పొడవు, పెన్సిల్ అంత లావున వుంది. నల్లగా మెరుస్తున్న శరీరం మీద తెల్లటి మచ్చలు వున్నాయి. ఏజెంట్ తన వైపే రావటం గమనించి, విషపుకోరలు బయట పెట్టి బుసలు కొట్టింది.

ఆ నిర్భాగ్యుడు ఆ హెచ్చరికను గమనించలేదు. అలాగే గుడ్డిగా ముందుకు వెళ్ళాడు. మెరుపులా అతని చీల మండమీద కాటందుకుంది పాము. కాలు పట్టుకొని భీకరంగా అరుస్తూ నేల మీద దొర్లాడా వ్యక్తి.

కుడిభుజం బ్లాక్ స్నేక్ మీద పడింది. కోపంతో పెచ్చు మీరిపోయిందా పాము. దెబ్బమీద దెబ్బగా అతని మెడమీద మూడుసార్లు కొట్టింది.

రెప్పపాటు కాలంలో జరిగిపోయిందా సంఘటన. క్రిందికి దిగబోతున్న షాడో భుజం పట్టుకొని “లాభం లేదు రాజు ! అతని పని అయిపోయింది. అతన్ని ఇక బ్రతికించటం దేవుడికి కూడా చేతకాదు ” అన్నది కెటీనా.

బురదలో పడి దొర్లుతున్న ఏజెంట్ వైపు జాలిగా చూసి తల విదిలించాడు షాడో. తను చేయగలిగింది ఏమి లేదని తెలుసుకొని, రివాల్వర్‌ని తీసి పట్టుకున్నాడు.

వర్షం తగ్గగానే అరణ్యంలో పెద్ద మార్పు వచ్చింది. నీటికి భయపడి ఆకుల చాటున తలలు దాచుకున్న క్రిమి కీటకాలన్నీ ఒక్కసారిగా బయటకు వచ్చాయి. పాములంత వున్న వానపాములు, చిమటలు, కుమ్మరి పురుగులు , నత్తలు, జెర్రులు, తీగె పురుగులు - - - ఇంకా పేర్లు లేని లక్షలాది కీటకాలు ఒకేసారి బురదలో నుంచి బయటికి వచ్చాయి. నల్లటి బ్లాంకెట్ నేలమీద పరిచినట్లు ఒక చీమల దండు అటుగా వచ్చింది.

“ఆఫ్రికా అడువుల్లో కల్లా పెద్ద చీమ ఇదే రాజు.... అది కుట్టిన శరీర భాగం కుళ్ళిపోతుంది. దాని విషానికి మందు లేదు ” షాడో వెనుక నిలబడి కామెంట్ చేసింది కెటీనా.

చీమల దండు క్రింద పడివున్న ఝరియా ఏజెంట్ మీదుగా పోతుందని గ్రహించి రివాల్వర్ అతని కేసి గురి పెట్టాడు షాడో.

అతని రక్షించటం అసంభవం. సాటి మానవుడిగా అతనికి చేయగలిగిన సాయం, బాధనుంచి విముక్తి కలిగించటమే.

ధన్ మని పేలింది రివాల్వర్. దాని మోత చెట్ల కొమ్మల్లో ప్రతిధ్వనించింది. చీమలదండు మీద పడి పీక్కు తినకముందే ఝరియా ఏజెంట్ ప్రాణాలు వదిలాడు.

వర్షం తగ్గిన రెండు గంటల తరువాత నేలమీది తడి ఆరిపోయింది. తడి ఆరిపోగానే క్రిమి కీటకాదులు - తమ స్థానాలకు వెళ్ళిపోయాయి మంచె దిగగానే మొదట ఝరియా ఏజెంట్‌ని మంచి స్థలం చూసి సమాధి చేశాడు షాడో. ఆ తరువాత పారాచూట్ కోసం వెతుకులాట ప్రారంభించారు ముగ్గరూ.

## 13

ఒక పెద్ద శాపిలిన్ చెట్టును కొండగుర్తుగా పెట్టుకొనిదాని చుట్టు ప్రక్కల నాలుగు మైళ్ళ దూరం వరకూ క్షుణ్ణంగా గాలించారు. పారాచూట్ కనిపించలేదు.

కటారి, కెటీనాలు పారాచూట్ కోసం వెతుకుతుంటే షాడో పారాచూట్ తో పాటు - తన శత్రువుల అడుగు జాడల కోసం చూస్తూ వుండేవాడు. రెండు మూడు సార్లు పొదలు కదిలాయి. అటు చూసిన వెంటనే అక్కడ ఏమీ వుండేది గాదు.

మూడు రోజులు విశ్రాంతి అనేది లేకుండా వెతికి వెతికి అలసిపోయారు ముగ్గురూ. ఓటమి ఎదురుపడటంతో షాడో హృదయంలో విసుగు జనించింది.

ఆ అరణ్యంలో పడిపోయిన చిన్న పాకెట్ని వెతకటం - గడ్డి వామిలో పడిన సూదికోసం గాలించటం లాంటిది. అయినా, పట్టు వదలకుండా అలాగే వెతుకుతున్నాడు.....

వర్షం మూలంగా బురదలో కూరుకుపోయిందేమో!

మట్టి కొట్టుకొని తమకు కనిపించనట్లు మారిపోయిందేమో !!

నాలుగవ రోజు వుదయించిన తరువాత కటారిని ఒక పెద్ద చెట్టు ఎక్కించి మిగిలిన వారు ఎక్కడెక్కడ వున్నారో చూడమని ఆదేశించాడు.

కటారి చెట్టు మీదికి వెళ్ళగానే చల్లగా షాడో ప్రక్కన చేరింది కెటీనా.

"రాజు.... యీ రాత్రికి! మనం బయటికి పోదాం ...." అన్నది మెల్లిగా. ఆ మాటలకు అర్థం తెలిసి చిన్నగా నవ్వాడు షాడో. అతని ముఖంలో ప్రతిబింబిస్తున్న కరుకుతనం మాయం అయిపోయింది.

"కెటీనా.... నువ్వు ఎందుకిలా అన్నావో నాకు తెలుసు. నా ప్రవర్తనలో ఏదో మార్పు వస్తున్నది అని అనుమాన పడ్డావు. నథింగ్ బేబి! క్రొత్త మార్పులు ఏవీ రాలేదు. ఆ పాకెట్ కోసం ఇక్కడికి వచ్చాను. దాన్ని క్షేమంగా నా దేశం చేరిస్తే గాని నాకు విశ్రాంతి లేదు. అందుకు ఎన్ని కిరాతకాలైనా చేస్తాను. ఒక వేళ అది మనకు దొరకకుండా మిగిలిన వారికి చిక్కితే - వారినందర్నీ హతమార్చి దాన్ని తిరిగి దక్కించుకుంటాను."

"నాకు పాపం, పుణ్యం అనే విచక్షణ అవసరం లేదు. నాకు దైవం నా కర్తవ్యమే, కర్తవ్య నిర్వహణ కోసం ఎన్ని పాపాలైనా చేస్తాను. నీతో శారీరక సుఖాల్ని పొందటం వల్ల - నా శరీరం విశ్రాంతి పొందుతుంది కాని, నా మనస్సు కాదు. "

షాడో మాటలు కెటీనాని మూగదాన్ని చేశాయి. అతనిలో దాగి వున్న అసలు వ్యక్తి - 'కిల్లింగ్ మాస్టర్ షాడో ' ఆ క్షణంలో ఆమెకు కనిపించాడు.

"రాజు.... అందరూ నీ పేరు వింటే.... భయపడటానికి కారణం నాకు ఇప్పుడు అర్థం అయింది " అంటూ చూపులు పక్కకు తిప్పుకున్నది.

కటారి చెట్టు దిగి రావటంతో వారి సంభాషణకు అంతరాయం కలిగింది.

"బిగ్ మాన్.... దేర్..... దేర్'' అంటూ రెండు దిశలకు చూపించాడు కటారీ.

రెండు కాంప్‌లు వున్నాయి...అంటే కర్నల్ కుర్షీద్, గిబ్బన్ !

"ఓ.కే. దెన్ ... మనం మన పని మొదలు పెడదాం '' అంటూ తిరిగి పాకెట్ కోసం వెతకటం ప్రారంభించాడు షాడో.

సాయం సమయం అయింది. వట్టి చేతులతో మంచె దగ్గరికి తిరిగి వచ్చారు.

మంచె చివర కూర్చని దీర్ఘమైన ఆలోచనలో మునిగిపోయాడు షాడో. ఉన్నట్లుండి కెటీనా లేచి అతని దగ్గరికి వచ్చింది.

''రాజు - నాకేదో భయంగా వుంది'' అన్నది అతన్ని ఆనుకొని కూర్చుంటూ.

''డోన్ట్ వర్రీ బేబి.... నేనుండగా నువ్వు దేనికి భయపడవలసిన అవసరం లేదు......'' భుజం తడుతూ అన్నాడు షాడో.

మెల్లిగా తల విదిలించిందామె. ''అది కాదు రాజు! మనం ప్రాణాలతో యీ చోటును వదలటం కుదరదని అనిపిస్తోంది.'' అన్నది.

ఆమె భుజాల చుట్టూ చేతులు చుట్టి దగ్గరికి లాక్కున్నాడు షాడో.

"పిచ్చి మాటలు మాట్లాడకు. ఇంత దూరం వచ్చి ఇన్ని ప్రమాదాలను ఎదుర్కున్నది ప్రాణాలు కోల్పోవటానికా? ఎందుకలా ఆలోచిస్తావ్?" అన్నాడు ఆమె కురులను నిమురుతూ.

లతలా అతన్ని పెనవేసుకుపోయింది కెటీనా.... "ఏమో రాజు! ఎంత ధైర్యంగా వుందామని అనుకున్నా నన్ను నిలువనీయటం లేదీ ఆలోచనలు....."

ఆమెను ఆ మూడ్ లోనుంచి బయటికి లాగకపోతే ప్రమాదం అని గ్రహించాడు షాడో. అందుకు ఒకే ఒక దారి వుంది. అదురుతున్న ఆమె పెదవుల్ని అలాగే నోటితో మూసి కౌగిలిలో బంధించాడు.

## 14

ముఖానికి పట్టిన చెమటను తుడుచుకుంటూ ఒక చెట్టు మొదలుకు ఆనుకొని నిలబడ్డాడు కర్నల్ కుర్షీద్. అతని అనుచరులు అందరూ అలసిపోయిన శరీరాలతో, పీక్కుపోయిన ముఖాలతో అతని ఎదురుగా నిలబడ్డారు.

వారి వదనాలలో ప్రతి ఫలిస్తున్న భావాన్ని చూసి తల అడ్డం తిప్పుతూ "మనం అప్పుడే వెనుతిరిగి పోవటం కుదరదు. షాడో, గిబ్బన్లు

ఇంకా వెతుకుతూనే వున్నారు. వారికి కూడా యింకా దొరకలేదది" అన్నాడు.

"కర్నల్! అసలా పేరాచూట్ యిక్కడ పడి వుండదు. మనం అనవసరంగా హైరానా పడుతున్నాం. యిప్పటికే ఎంతో మంది సహచరులను పోగొట్టుకున్నాం. యిల్లూ వాకిళ్ళు విడిచి పెట్టి - అయిన వారికి దూరంగా, దిన దిన గండంలా వున్న యీ ప్రత్యక్ష నరకంలో యింకెంత కాలం అని వుండటం ?" ధైర్యం చేసి అడిగాడు ఒక అనుచరుడు.

"అది నిర్ణయించాల్సింది మనం కాదు. ఇండియన్ ఏజెంట్ షాడో. యింకా వెతుకుతూనే వున్నాడు. అతను వెనుతిరిగితే మనం కూడా వెనక్కి వెళ్ళిపోదాం. షాడో జాంబెసీలో వున్నంతకాలం మనం వుండి తీరాలి."

ఇక అతనితో వాదించి ప్రయోజనం లేదని చెట్ల కింద కూలబడ్డారు అతని అనుచరులు, ఎంతో మంది కాదు....చావగా మిగిలిన ముగ్గురూ.

వారికి కొద్ది దూరంలో ఒక చిన్న ఆకుల గుడిశెలో కూర్చుని అదే విధంగా మంతనాలు చేస్తున్నాడు గిబ్బన్. అతనితో వచ్చిన కొండజాతి వారు యిద్దరూ మౌనంగానే వున్నారు. అతని స్నేహితుడు మాత్రం గట్టిగా వాదిస్తున్నాడు.

అతని మాటలు వింటున్న కొద్దీ గిబ్బన్ ఆవేశం హద్దులు దాటుతున్నది - పిడికిళ్ళు బిగించి పళ్ళు కొరుకుతున్నాడు.

“గిబ్బన్! యింకా ఎంతకాలం వెతుకుతాం? వెళ్ళి పోదాం పద....యిక యిక్కడ వుండటం నాకు చేత కాదు.”

గోడకు ఆనించిన రైఫిల్ ని స్నేహితుడు మీదికి విసిరి గుడిశె బయటికి దారి చూపించాడు గిబ్బన్ “చేతకాకపోతే వెళ్ళిపోవచ్చు.... నిన్ను వుండమని నేను బలవంతం చేయను ” అన్నాడు ముక్తసరిగా.

వంటరిగా అరణ్యం దాటటం అనే సరికి అతని స్నేహితుడి కాళ్ళు చల్లబడ్డాయి. రైఫిల్‌ని నేలకేసి బాది గుడిశె బయటికి వచ్చి నిలబడ్డాడు. తనలో తనే నవ్వుకుంటూ కొండజాతి వారిని దగ్గరికి పిలిచి, వారి చెవుల్లో ఏదో చెప్పటం ప్రారంభించాడు గిబ్బన్.

* * *

కర్నల్ కుర్షీద్, గిబ్బన్ మొదలైన వారి పథకాలు ఏమిటో తెలియని షాడో, రాళ్ళతో ఆడుకుంటూ విశ్రాంతిగా కూర్చుని కెటీనా చెపుతున్న మాటలు వింటున్నాడు.

"రాజు! మీ పైలట్ పారాచూట్ వదిలింది ఇక్కడ కాదు. మీకు అందిన వివరాలలో ఏదో పొరపాటు వున్నది" ఎంత వెదికినా పారాచూట్ కనిపించక పోవటంతో కెటీనా సందేహాలు స్పష్టమైన రూపం ధరించసాగాయి.

ఆమె మాటలు విన్న షాడో నవ్వుతూ "అలా అయితే యిక దిగులు అనవసరం . పిక్నిక్‌కి వచ్చామని భావించుకుందాం. ఇంకో రెండు రోజులు యిక్కడే జాలీగా గడిపి వెళాదాం " అన్నాడు.

"బీ సీరియస్ రాజు... యిది నవ్వులాటకు సమయం కాదు."

"మరి దేనికి?" చిలిపిగా ప్రశ్నించాడు షాడో.

కెటీనా బుగ్గలు ఎరుపెక్కాయి. చిన్న మట్టి పెళ్ళను తీసుకొని అతని మీదికి విసిరింది. కోపం నటిస్తూ లేచి వెంటపడ్డాడు షాడో. పారిపోయిందామె. పొదలలో దూరి మాయమైపోయింది.

ఒక్కొక్క పొదనే గాలిస్తూ ఆమె కోసం వెతకటం ప్రారంభించాడు షాడో. ఉన్నట్లుండి అతనికి ఎడమవైపున వున్న చిన్న ముళ్ళ పొదలో కదలిక కనిపించింది.

గిరుక్కున అటు తిరిగాడు. పొదను సమీపించేసరికి గుర్రుమని భీకరంగా అరుస్తూ అతనిమీదికి లంఘించింది ఒక ఆడకోతి.

పొద చాటున తీరికగా కూర్చున్న పిల్లకు స్తన్యం యిచ్చుకుంటుంది. షాడో రాక ఆమె ఏకాంతానికి అడ్డువచ్చింది.

"మై గాడ్....తల్లీ నీకో నమస్కారం.... నీకు గాని ....నీ చిరంజీవికి గాని అపకారం తలపెట్టే ఉద్దేశం నాకు లేదు. నా మీదికి రాకు....." అంటూ వెనక్కి గెంతాడు షాడో.

కోరలాంటి పళ్ళను బయటపెట్టి కోపంగా చూస్తూ బిడ్డను వక్షస్థలానికి హత్తుకుంది ఆ మాతృమూర్తి. షాడో మరో నాలుగు అడుగులు వెనక్కి వేశాడు. వెంటనే బిడ్డతో సహా ఒక చెట్టు మీదికి పారిపోయిందది.

"డామిట్... కోతికి కూడా యింత కోపం అయితే.... ఇక బ్రతికేది ఎలా?" అనుకుంటూ దానివంకే చూస్తున్నాడు షాడో.

చిటారుకొమ్మలకు పాకిపోతున్న ఆ ఆడకోతి షాడో అంతరంగంలో మరో క్రొత్త ఆలోచనను రేకెత్తించింది.

కోతులకున్న కుతూహలం - మానవులకు గూడా ఉండదు . తమకు అర్థంకాని విషయాన్ని అర్థం చేసుకునేదాకా అవి నిద్రపోవు. సప్పోజ్ - పారాచూట్ గాలిలో నుంచి కిందికి దిగుతుండగా కోతులు చూసి వుంటే?

‘‘డామిట్! అదే జరిగివుంటుంది.... చూడవలసిన ప్రదేశాలను వదిలిపెట్టి అనవసరంగా కాలయాపన చేశాం!’’ అనుకుంటూ ‘‘కెటీనా! కటారి!! కమాన్ క్విక్, క్విక్ !’’ అని అరిచాడు.

అతనికి పది అడుగుల దూరంలో వున్న పొదలోనుంచి కెటీనా బయటికి పరుగెత్తుకుంటూ వచ్చింది. పళ్ళు ఏరుకు రావటానికి పోయిన కటారి ఉరుకులూ పరుగు మీద వచ్చిపడ్డాడు.

‘‘ఈ సారి మనం చూడవలసినది క్రిందికి కాదు.... పైకి ఆకాశంలోకి ’’ అంటూ తన ఆలోచనను వారికి వినిపించాడు షాడో.

వెంటనే ముగ్గరూ మూడు దిశలకు పరుగుతీశారు.

పైన చూడటం కూడా షాడో ఆశించినంత తేలిక కాదు. తలలు ఎత్తి, మెడలు రిక్కించి, పైకి చూస్తూ నడవటం వల్ల, ముందున్న పొదలు కనిపించక బోర్లా పడిపోయారు చాలాసార్లు. ఉదయమంతా వెతికారు. మధ్యాహ్న సమయానికి షాడో సెర్చి విజయవంతమయింది.

కెటీనా, కటారీలను పిలిచి ఒక చెట్టు మీదికి చూపించాడు. చిటారు కొమ్మల్లో..... చిక్కుపడి వేలాడుతున్నది పారాచూట్. వర్షం మూలంగా ముడుచుకుపోయి కొమ్మలకు అతుక్కుపోయి వుంది. దాని చివర భాగంలో

వేలాడుతున్న చిన్నరేకు పెట్టెను పట్టుకొని వుయ్యాలలూగుతున్నది ఒక చిన్న కోతి.

క్రింది నుంచి చూస్తున్న వారిని గమనించి పళ్ళన్నీ బైట పెట్టింది. షాడో చెప్పనవసరం లేకుండానే బరబరా చెట్టు మీదికి పాకాడు కటారి.

రేకు పెట్టెను వూడదీసి క్రిందికి దించాడు.

"థేంక్ గాడ్.... వచ్చినపని నెరవేరింది" పెట్టెను చేతిలోకి తీసుకుంటూ తేలికగా నిట్టూర్చాడు షాడో. పని పూర్తి అయిందన్న సంతోషంతో ఒక్కక్షణం - ఒక్క కనురెప్ప కాలం పాటు పరిసరాలు ప్రమాదాలను మర్చిపోయాడు.

అదే సమయంలో అతనికి తెలియకుండా.... చెట్ల చాటున తప్పుకున్నది ఒక ఆకారం.

## 15

"యిక మనం చెయ్యవలసిన పని ఏమిటి రాజూ?" మంచె దగ్గరికి తిరిగి వస్తూ ప్రశ్నించింది కెటీనా.

"క్షేమంగా యింటికి తిరిగి వెళ్ళటం. ఇదే మన ప్రస్తుత కర్తవ్యం" అంటున్న షాడో.... చెట్ల చాటు నుంచి మీదికి వచ్చిన వ్యక్తుల్ని చూసి ఎగిరి ప్రక్కకు దూకాడు.

ఎగిరి అతని గుండెల మీద తన్నాడొక వ్యక్తి. షాడో వెల్లకిలా పడిపోయాడు. రేకు పెట్టె జారి ఒక పొదలో పడిపోయింది. రెండవ వ్యక్తి దాని కోసం వెళ్ళబోతుండగా కాళ్ళు అడ్డం పెట్టి కింద పడవేశాడు షాడో. అదే వూపులో రబ్బర్ బంతిలా లేచి నిలబడి హంటింగ్ నైఫ్‌ని తీస్తున్న మొదటి వ్యక్తి మీదికి లంఘించాడు. ఇంతలో కింద పడిన రెండవ వ్యక్తి లేచి అతన్ని వెనుక నుంచి ఎదిరించాడు.

వారితో ఫైటింగ్ చేస్తూ అ మూల్యమైన సమయాన్ని వృథా చేయటం యిష్టం లేక రివాల్వర్ తీశాడు షాడో.

రివాల్వర్ చూడగానే పొదలలోకి పరుగులు తీశారు వారిద్దరూ. ఆశ్చర్యంగా వెనుతిరిగిన షాడో - తన గుండెల మీదికి గురిపెట్టి నిలబడిన గిబ్బన్‌ని చూసి నొసలు చిట్లించాడు.

''నువ్వు చాలా మొండివాడివి మిస్టర్ షాడో.... ఒకసారి నా బారినుంచి తప్పించుకున్నావ్..... ఇక తప్పించుకోలేవు. నీ ఆట కట్టింది'' అంటూ ట్రిగ్గర్ మీద వేలు బిగించాడు గిబ్బన్.

రివాల్వర్ ఎత్తే అవకాశం లేదు. తను రివాల్వర్‌ని గురి పెట్టేలోగా రైఫిల్ బుల్లెట్ తన శరీరంలోకి ప్రవేశిస్తుంది.

కండరాలు బిగించి నిప్పులు వెదజల్లుతూ వచ్చే బుల్లెట్ కోసం సిద్ధంగా ఎదురుచూస్తూ నిలబడ్డాడు షాడో.

గిబ్బన్ ట్రిగ్గర్ నొక్కాడు. ధన్‌మని శబ్దం చేసింది రైఫిల్. బుల్లెట్ మాత్రం షాడో మీదికి రాలేదు.

కెటీనా, కటారీలను కత్తులతో బెదిరించి గిబ్బన్ ప్రక్కన నిలబెట్టి వుంచాడు అతని సహచరుడు.

గిబ్బన్ రైఫిల్ పేలుస్తున్న సమయంలో సడన్‌గా కదిలాడు కటారి. ఎగిరి ముందుకు దూకాడు. షాడో మీదికి రావల్సిన బుల్లెట్ అతని గుండెల్లో ప్రవేశించింది.

షాడో కళ్ళు ఎర్రబడ్డాయి. ఆవేశం నరనరాలకు వ్యాపించింది. "గిబ్బన్! యూ బ్లడీ బాస్టర్డ్!!"

అని అరుస్తూ రివాల్వర్ ఎత్తాడు.

దాని బుల్లెట్ గిబ్బన్ రైఫిల్ మీద పడి దాన్ని నిరుపయోగం చేసేసింది. మరో సారి ట్రిగ్గర్ నొక్కాడు షాడో. గిబ్బన్ సహచరుడు మట్టి కరిచాడు. అదే అదునుగా ముందుకు దూకి షాడో మీద కలబడ్డాడు గిబ్బన్.

రివాల్వర్‌ని వదిలి అతన్ని ఎదుర్కొన్నాడు షాడో. అతని చేతులనుంచి తప్పుకుని ప్రక్కకు తిరిగాడు గిబ్బన్. మెరుపులా బెల్టుకు వున్న హంటింగ్ నైఫ్‌ని బయటికి లాగాడు.

ఒక అడుగు ముందుకు వేసి ఆ చేతిని తన పిడికిళ్ళల్లో బిగించాడు షాడో. “గిబ్బన్....నీ పాపం పండింది. ఈ క్షణంతో నీ బ్రతుకు తెల్లవారింది” అంటూ బలంగా ముందుకు లాగాడు. షాడో భుజాల మీది నుంచి గాలిలోకి లేచాడు గిబ్బన్. తల్లకిందులుగా వెనక్కి పడ్డాడు.

తల ముందుగా నేలకు గుద్దుకుంది. ఫట్ మని శబ్దం చేస్తూ మెడ ఎముక విరిగిపోయింది. కాళ్ళు నేల మీద పడకముందే గిబ్బన్ ప్రాణాలు ఆకాశంలోకి ఎగిరిపోయాయి.

అతని వైపు చూడకుండా కటారి దగ్గరికి పరుగెత్తాడు షాడో. కెటీనా కటారి తలను వడిలోకి చేర్చుకొని కూర్చుని వుంది. నీరసంగా నవ్వుతున్నాడు కటారి. అతని పని అయిపోయింది. బుల్లెట్ గుండెలో నుంచి పోయి, వెన్నులో నుంచి బయటికి వచ్చింది.

షాడోతో మాట్లాడటం కోసమే ప్రాణాలు బిగపట్టుకొని వున్నాడు.

అతని ముందు మోకరించి కూర్చుని భుజంమీద చెయ్యి వేశాడు షాడో. కటారి ముఖం విప్పారింది.

"కటారి..... బిగ్ బిగ్ మాన్..... గుడ్ ఫ్రండ్.... ప్లెంటీ స్ట్రాంగ్....." అన్నాడు షాడో గద్గద స్వరంతో.

కటారి సంతోషానికి మేరలేక పోయింది. ఆనందంగా నిట్టూర్చాడు. నవ్వుతూనే ప్రాణాలు వదిలాడు.

కెటీనా వంక చూసి భారంగా నిట్టూర్చాడు షాడో. ఆమె భయం కొంత వరకూ యదార్థమయింది. ఏదో కీడు జరగబోతున్నదని అన్నది. అన్నట్లుగానే కటారి తమను విడిచి వెళ్ళిపోయాడు. తామిద్దరూ బ్రతికే ఉన్నారు. అరణ్యం దాటే దాకా బ్రతికే ఉంటారా ?

"రాజు... కటారిని పాతిపెట్టవలసిన అవసరంలేదు. తనలో మరణించిన వారినే సమాధి చేస్తుంది. జాంబెసీ అరణ్యం. ఆ ఆచార ప్రకారమే కటారిని ఆకులతో కప్పి గౌరవిద్దాం" కన్నీటి ధారలను అరికట్టుకోవటానికి విఫల ప్రయత్నం చేస్తూ అన్నది కెటీనా.

తల వూపుతూ లేచాడు షాడో. పొదల్లో పడిన రేకు పెట్టెను అందుకొని దాని మీదవున్న చిన్న మీటను నొక్కాడు. వెంటనే ఎలక్ట్రానిక్ బ్రెయిన్‌తో పాటు అందులో అమర్చబడివున్న ట్రాన్స్‌మీటర్ పనిచేయసాగింది.

"రాజు.... ఎలక్ట్రానిక్ బ్రెయిన్ చేతికి చిక్కిన మరుక్షణం, ఆ విషయం ట్రాన్స్‌మీటర్ ద్వారా మాకు తెలియచెయ్యి. నీకోసం ఒక సూపర్ సానిక్ విమానం జాంబెసీ అరణ్యం మీద రౌండ్లు కొడుతూ వుంటుంది. నీ మెస్సేజిని రిసీవ్ చేసుకోగానే అటు వస్తుంది. వెంటనే నీతో తీసుకుపోతున్న మినీ బెలున్‌కి రేకు పెట్టెను బిగించి గాలిలోకి వదులు. విమానంలోని వారు దాన్ని అందుకుంటారు. అక్కడితో ఎసైన్‌మెంట్ కంప్లీట్ అయిపోయినట్లే " అన్నారు కులకర్ణి .

ఆ మాటల్ని గుర్తుకు తెచ్చుకుంటూ సూపర్ సానిక్ విమానానికి మెస్సేజి పంపించాడు షాడో.

రెండు నిమిషాల తరువాత జవాబు వచ్చింది. వంద మైళ్ళ అవతల వున్నదా విమానం. వెంటనే అటు ప్రయాణం ప్రారంభించింది.

బెల్టుకు అమర్చుకున్న లెదర్ బాక్సులో నుంచి చిన్న అట్టపెట్టెను తీశాడు షాడో. దాని మూత తెరిచిన మరుక్షణం బుస్సుమంటూ పైకిలేచింది చిన్న బెలూన్. దానికి వేలాడుతున్న దారాలకు ఎలక్ట్రానిక్ బ్రెయిన్‌ని బిగించి కట్టి విమానం కోసం ఎదురు చూడసాగాడు.

కటారిని ఒక చెట్టు కింద పడుకోబెట్టింది కెటీనా. చిన్న చిన్న కొమ్మలు నరికి అతని మీద పేర్చింది. ఆకులు, అడివి పూలను అందంగా ఆ కొమ్మలమీద అమర్చి ఆఖరిసారిగా అతన్ని చూసి వెనుతిరిగింది.

చెవులు చిల్లలు పడే శబ్దంతో, చెట్లకు వంద అడుగుల ఎత్తున్న ఎగురుతూ వచ్చింది విమానం.

చెట్ల కొమ్మలు అడ్డుగా లేని ప్రదేశంలో నిలబడి బెలూన్‌ని గాలిలోకి వదిలాడు షాడో. రౌండ్లు కొడుతూ మెల్లిగా గాలిలోకి లేచింది బెలూన్.

అదే సమయంలో పొదలను తప్పించుకొని ఆ ప్రదేశం లోనికి అడుగు పెట్టాడు కర్నల్ కుర్షీద్.

## 16

"హల్లో కర్నల్! ఈ సారి కూడా నేనే గెలిచాను...." నవ్వుతూ బెలూన్ వైపు చూపించాడు షాడో.

షాడో వంక ఆశ్చర్యంగా చూసి తల ఎత్తాడు కర్నల్ కుర్షీద్. బెలూన్ అరఫర్లాంగు ఎత్తుకు వెళ్ళింది. విమానం దాని చుట్టూ రౌండ్లు కొడుతున్నది.

వారు చూస్తుండగానే విమానం ముందు భాగంలో నుంచి పెద్ద ఇనుప చువ్వ బయటికి వచ్చింది. బెలూన్ తాళ్ళను మెలిపెట్టి

విమానంలోకి లాగుకున్నది. ఆ తరువాత మరొక్కక్షణం కూడా అక్కడ వుండకుండా శరవేగంతో భారతదేశం వైపు దూసుకుపోయింది ఆ సూపర్ సానిక్ విమానం.

షాడో వంక చూస్తూ చేయిజాచాడు కుర్షీద్.

"ఐ లైక్ యూ మిస్టర్ షాడో. నీతో పోటీ చేసి ఓడిపోవటం కూడా నాకు సంతోషమే కలిగిస్తున్నది " అన్నాడు.

అతనితో కరచాలనం చేయటానికి చేయి అందిస్తూ వులిక్కిపడ్డాడు షాడో.

"మిస్టర్ షాడో! వచ్చేటప్పుడు శత్రువులుగా వచ్చాం....ఈ అడవిని దాటే వరకైనా కలిసి ప్రయాణిద్దాం." అంటున్నాడు కర్నల్ కుర్షీద్.

"ఇంకెక్కడి ప్రయాణం కర్నల్! అంతా అయిపోయింది. మనం కలసి ప్రయాణించవలసింది మన దేశాలకు కాదు.....నరకానికి....." అంటూ పొదల వైపు చూపించాడు షాడో.

నిశబ్దంగా వచ్చి ఆ ప్రదేశాన్ని చుట్టు ముట్టారు హెడ్ హంటర్స్. వందమంది కిరాతకులు....యమ భటుల్లా నిలబడివున్నారు వారిచుట్టూ.

* * *

పదునైన యీటెలు వారి రక్తాన్ని రుచి చూడటానికి సిద్ధంగా వున్నాయి. తమ వారిని చంపటమే కాదు.... తమ గూడేన్ని తగలబెట్టి గోల చేశారన్న కక్షతో ప్రతీకారం చెయ్యటానికి వచ్చారు.

వారి కళ్ళల్లో మెదులుతున్న పట్టుదలను గమనించాడు షాడో. అతని మనస్సులో అనేక రకాల ఆలోచనలు మొదులుతున్నాయి. పోరాడి వారిని జయించటం చాలా కష్టం, అసంభవం కూడా.

మూఢనమ్మకాలకు దాసులు ఆ అడవి జాతివారు. ఆ లైన్‌లో వారిని బెదరగొట్టి ప్రాణాలు దక్కించుకునే ప్రయత్నం చెయ్యాలి. అందరికంటె వెనుకగా రావటంవల్ల ఝురియా వారికి హెడ్ హంటర్స్‌తో పరిచయం కలుగలేదు.

కర్నల్ కుర్షీద్‌కు ఏమీ అర్థం కాలేదు. "మిస్టర్ షాడో! ఏమిటది? ఎవరీ రాక్షసులు?" ఖంగారుగా ప్రశ్నించాడు.

"హెడ్ హంటర్స్" అన్నాడు షాడో.

అప్పటికీ కుర్షీద్‌కి ఆ విషయం బోధపడలేదు.

చూపుడు వేలితో మెడ మీద అడ్డంగీసి కన్ను గీటాడు షాడో.

కర్నల్ కుర్షీద్ ముఖం పాలిపోయింది. పెదిమలు అదరసాగాయి.

తన అనుచరులకు సైగ చేసి షాడోను ముందుకు లాగించాడు హెడ్ హంటర్స్ నాయకుడు.

వాళ్ళ బారి నుంచి తప్పించుకోవటం అసాధ్యమని గ్రహించాడు షాడో. తాము చేసిన పనులు క్షమింపరానివి. ఉన్నట్లుండి అతని మస్తిష్కంలో కులకర్ణి గారి మాటలు తళుక్కున మెరిశాయి.

"రాజు! జాంబెసీ అడవిలో నీకు పూర్తి రక్షణ కల్పించగల ఆయుధాలు మన వద్ద లేవు. నీ ఇమాజినేషన్ వుపయోగించి ఉన్న వాటితోనే పని పూర్తి చేసుకురావాలి."

షాడో పెదిమల మీద చిన్నగా చిరునవ్వు మెలకెత్తింది. కెటీనా వైపు తిరుగుతూ "బేబి ! నాయకుడితో మాట్లాడాలి. అనుమతిస్తారేమో అడిగి చూడు " అన్నాడు.

కెటీనా హెడ్ హంటర్స్ భాషలో అతని కోరికను నాయకుడికి నివేదించింది. రెండు క్షణాలు ఆలోచించి తల వూపాడతను.

"కెటీనా.... మన తలలు ఈ వెధవల దేవతకు అక్కరలేదని చెప్పు, మనల్ని చంపితే ఆమెకు కోపం వస్తుందని బెదిరించు" కెటీనా కు మాత్రమే వినబడేటట్లు అన్నాడు షాడో.

కెటీనా ఆ మాటల్ని ట్రాన్స్‌లేట్ చేసింది. బొంగురు గొంతుతో నాయకుడు అరిచిన అరుపుల్ని జాగ్రత్తగా విని "రాజు.. వీడు నీ మాటల్ని నమ్మటం లేదు. అసత్యాలు పలికే నీ నాలుకను నిప్పుల్లో కాల్చి కొండ దేవతకు నైవేద్యం పెడతానని అంటున్నాడు" అన్నది షాడో వంక చూస్తూ.

"వాడి ముఖం. కావాలంటే ఆ కొండ దేవతతో పర్సనల్‌గా మాట్లాడి నా మాటల్ని నిరూపిస్తానని చెప్పు "

తర్జుమా చేసింది కెటీనా. నాయకుడు ఆశ్చర్యంగా షాడో వంక గుచ్చి గుచ్చి చూశాడు.

ఆ అవకాశాన్ని వదలకుండా వెంటనే కెటీనాను హెచ్చిరించాడు షాడో.

"కొండ దేవతతో మాట్లాడి, ఆమెకు మన తలలు అవసరం లేదని నిరూపించటానికి ఒక గుర్తు చూపిస్తానని చెప్పు " అన్నాడు.

"మిస్టర్ షాడో.... ఎందుకీ నాటకం? మీదపడి అటో ఇటో తేల్చుకుందాం " జారిపోతున్న ధైర్యాన్ని కూడా తీసుకుంటూ అడ్డు వచ్చాడు కర్నల్ కుర్షీద్.

"మిస్టర్ కుర్షీద్.... మాటలు అన్నంత తేలికగా పనులు కావు."

"నాన్సెన్స్... ఫైటింగ్ చేద్దాం."

"ఓ...కే. యువర్ విల్ అండ్ ప్లెజర్... మీ యిష్టం వచ్చినట్లు చేయండి"

కుర్షీద్ చుట్టూ చూసి తడబటం గమనించి నవ్వుకున్నాడు షాడో. ఒకరిద్దరయితే అతనన్నట్లు ఫైటింగ్ చేసి ప్రాణాలు దక్కించుకోవచ్చు. వందమంది యమభటుల్లా నిలబడివున్నారు . ఎంతమందినని చంపటం ?

"ఆల్ రైట్ షాడో .... ప్రొసీడ్.... ఆ చేసే ప్రార్థన ఏదో కాస్త గట్టిగా - - - ఆ కొండ దేవతకు వినబడేటట్లు చెయ్యి." ఎండిపోయిన పెదిమలను నాలుకతో తడుపుకుంటూ అన్నాడు కర్నల్ కుర్షీద్.

"రాజూ నువ్వు కొండ దేవతతో మాట్లాడటం తను స్వయంగా చూస్తేనే గాని నమ్మనంటున్నాడు నాయకుడు....." తొందర చేసింది కెటీనా.

జేబులో వున్న మెటల్ బాల్‌ని ఎవరూ చూడకుండా వెనుక నుంచి ఆమె చేతికి అందించాడు షాడో. అది కుర్షీద్‌ని అతని అనుచరులను కందిరీగల బారినుంచి రక్షించిన గాస్ బాంబు.

"అందరినీ మోకాళ్ళ మీద కూర్చోమని చెప్పు" అంటూ దాన్ని ఉపయోగించే విధానాన్ని కెటీనాకు రహస్యంగా చెప్పాడు.

అనుమానంగా చూస్తూ మోకరించారు హెడ్ హంటర్స్. వారి మధ్యలో కూర్చుని చేతులు ఆకాశం వైపు జూచాడు షాడో.

“ఓ కొండ దేవతా.... మైటీ గాడెస్ ఆఫ్ దిస్ బ్లడీ హెడ్ హంటర్స్....” షాడో మాటలను యధాతథంగా తర్జమా చేసింది కెటీనా.

పైకి ఉబుకుతున్న నవ్వును అదిమి పట్టుకోవటానికి విఫల ప్రయత్నం చేస్తూ ప్రార్థన చేస్తున్నట్లు తలలు వంచుకున్నారు కుర్షీద్ - అతని అనుచరులు.

షాడో పెద్ద పెద్ద అరుపులు అరుస్తున్నాడు. “కొండ దేవతా - - - తల్లీ.... ఈ కొండ నాయకుడికి మా తలలు అవసరం లేదని చెప్పు. లేకపోతే మా ప్రాణాలు తీసేస్తాడు. ”

తల వంచి నేలకు ఆనించాడు. అందరూ అతన్ని ఫాలో అయ్యారు. మళ్ళీ లేచి ఆకాశంలోకి చూశాడు షాడో.

రెండు క్షణాల పాటు భయంకరమైన నిశబ్దం ఆ ప్రదేశంలో రాజ్యం చేసింది. ఏమీ జరగక పోయేసరికి హెడ్ హంటర్స్ నాయకుడు గర్వంగా నవ్వాడు. షాడో కబుర్లు చెప్పటం తప్ప, చేతులు చూపించలేడని అతనికి అర్థం అయింది.

“ఒక గుర్తు....ఒకే గుర్తు - - - ఈ మొద్దు ముఖాలు అర్థం చేసుకోగల ఒక గుర్తు పంపు తల్లీ!” ఉన్నట్లుండి అరిచాడు షాడో. అందరూ ఉలిక్కిపడి అతని వంక చూశారు.

"కెటీనా...ఈ సారి తలలు వంచగానే మెటల్ బాల్‌ని పైకి విసురు." లో గొంతుకతో హెచ్చరించి తల నేలకు ఆనించాడు షాడో.

నాయకుడు తల వంచాడు. అతన్ని అనుసరించారు అతని అనుచరులు. మరుక్షణం మెటల్ బాల్ మీది బుడిపెను నొక్కి చల్లగా గాలిలోకి వదిలింది కెటీనా.

బుస్సుమని శబ్దం చేస్తూ. తెల్లటి పొగను విరచిమ్ముతూ కందిరీగలాగా గాలిలో రౌండ్లు కొట్టటం ప్రారంభించిందది.

అదిరిపడి లేచాడు కొండజాతి నాయకుడు.

"తల్లీ... మాతా... దేవి కోపం వద్దు. ఏదో అమాయకులు ...పొరపాటు పడ్డారు. మా తలలు తెగకుండా వుంటే మాకు చాలు...." అని అరుస్తూ అతని భయాన్ని రెట్టింపు చేశాడు షాడో.

కొండ దేవత నిజంగానే కోపగించి హుంకరిస్తున్నదని భావించాడు హెడ్ హంటర్స్ నాయకుడు.

అతని అనుచరులు షాడో వంక భయం భయంగా చూడసాగారు. వారికి అతనొక మహా మాంత్రికునిలా ఆగుపించసాగాడు.

పదిక్షణాలపాటు సహచరులతో మంతనాలు జరిపి షాడో వంక చూశాడు హెడ్ హంటర్స్ నాయకుడు.

అడవి వైపు చేయి జాచి "గో!" అని అరిచాడు.

అంతే! ఆ తరువాత ఒక్కక్షణం కూడా అక్కడ నిలబడ లేదు షాడో.

కెటీనా చెయ్యి పట్టుకొని శర వేగంతో పరుగులు తీశాడు. బ్రతుకుజీవుడా అనుకుంటూ అతన్ని అనుసరించాడు కుర్షీద్.

ఎక్కడా ఆగకుండా రెండు రోజులు ప్రయాణం చేసి అడ్డదారుల గుండా షెర్రా వచ్చి చేరుకునే వరకూ విశ్రాంతి తీసుకోలేదెవరూ.

షెర్రా పొలిమేరల్లో షాడోకి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు కర్నల్ కుర్షీద్.

"మిస్టర్ షాడో! నీ తెలివి తేటలవల్లనే మనం యిలా ప్రాణాలతో బయట పడగలిగాము. మళ్ళీ మనం ఎప్పుడైనా కలుసుకుందాం" అన్నాడు స్మార్ట్‌గా శాల్యూట్ చేస్తూ.

ప్రతి కక్షి గొప్పతనాన్ని గుర్తించటంలోనే వుంది అంతా, "తప్పకుండా కర్నల్ ! విష్‌యూ ఎ హేపీ జర్నీ" అంటూ కరచాలనం చేశాడు షాడో.

షెర్రా పొలిమేరలు సమీపిస్తుండగా.... కొన్ని ఆకులు, తీగలు ఉపయోగించి చిన్న బ్రాసరీ తయారు చేసుకుంది కెటీనా, మరొక్కసారి నాగరిక యువతిగా మారిపోయింది.

చర్చి ఆవరణలో షాడో కోసం ఒక హెలీకాప్టర్ రెడీగా వుంది. ఫాదర్ మరికొన్ని రోజులు వుండి పొమ్మని అర్థించినా, కెటీనా చూపులు కాళ్ళకు సంకెళ్ళు తగిలించటానికి ప్రయత్నించినా - - - ఆగకుండా బయలుదేరాడు షాడో.

జాంబెసీ అరణ్యంలోని అనుభవాలు - ఒక పంచరంగుల సుందర స్వప్నాలు. కెటీనాతో సంబంధం అడవి దాటిన మరుక్షణం మాయం అయింది. ఆమె ఎవరో! తను ఎవరో!!

"రాజు! మళ్ళీ కలుసుకుంటామా?" హెలీకాప్టర్ ప్రక్కన నిలబడి నీరు నిండిన కళ్ళతో ప్రశ్నించింది కెటీనా.

"డియర్! నీకు తెలుసు గదా మా జీవితాలు, మరుక్షణంలో ఎటు తిరుగుతాయో మాకే తెలియదు. ఈ రోజు గడిచి.... రేపును కళ్ళ చూసే దాకా తెలియదు. అయినా ఆశించటంలో తప్పేముంది? మళ్ళీ కలుసుకుందామనే కోరుకుందాం" ఆమె తల నిమురుతూ అన్నాడు షాడో.

హెలీకాప్టర్ ప్రొపెలర్స్ గ్రిరున తిరగటం ప్రారంభించాయి పైలట్ సైగ అందుకొని ద్వారంలో అడుగు పెట్టాడు షాడో.

తలుపు మూసుకుంది. హెలీకాప్టర్ గాలిలోకి లేచింది.

అది కనుమరుగయ్యే దాకా చూసి బరువుగా నిట్టూర్చింది కెటీనా.

“మళ్ళీ.... ఎప్పుడో కలుసుకోవటం.....” అనుకుంటూ భారంగా చర్చి వైపు అడుగులు వేసింది.

- - - జైహింద్ - - -


CORNIVAL FOR KILLERS
MADHU BAABU